RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 242 శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..

చెన్నై: రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది.




## 'కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయి... కెరీర్‌లు దెబ్బతింటాయ్' - కమ్యూనిటీల్లో అస్థిరత!

న్యూయార్క్: వలస విధానాన్ని ఆయుధంగా వాడుకుని హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం ద్వారా తన విదేశీ వ్యతిరేకతను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింతగా చాటుకుంటున్నారని ప్రవాస భారతీయ సంస్థ ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతన్ పటేల్ ధ్వజమెత్తారు. వీసా ఫీజు పెంపు అమెరికన్లకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి కాదని అభిప్రాయపడ్డారు. లక్ష డాలర్ల వీసా ఫీజును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ గందరగోళ చర్య ద్వారా విదేశీయుల్లో భయాందోళనలను, గందరగోళాన్ని ట్రంప్ సృష్టించారని విమర్శించారు. హెచ్1బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మన ఆర్థిక భవిష్యత్తుకు నష్టం కలగజేయడంతోపాటు ఇండియన్ అమెరికన్ల పట్ల వివక్షను ప్రదర్శించారని వ్యాఖ్యానించారు. 'ట్రంప్ నిర్ణయ ప్రభావం వెంటనే పడుతుంది. అది భారీ నష్టానికి దారి తీస్తుంది. కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయి. కెరీర్‌లు గాడి తప్పుతాయి.

కమ్యూనిటీలు అస్థిరపడతాయి. వలసదారులు అమెరికాకు అతి పెద్ద బలం. వారు సంపదను సృష్టిస్తున్నారు. అటువంటి బలాన్ని మరింతగా బలోపేతం చేసే బదులు ట్రంప్.. వలస విధానంలోని ప్రతి అంశాన్ని దెబ్బతీస్తున్నారు. వ్యాపారాలను అస్థిరపరుస్తున్నారు. మన ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నారు' అని పేర్కొన్నారు.

**అమెరికాకు వెన్నెముక..** హెచ్1బీ వీసాదారులు అమెరికాకు వెన్నెముకని న్యాయవాది నవ్‌నీత్ ఛుగ్ అభిప్రాయపడ్డారు. ఏటా 15 లక్షల మంది ఇంజినీర్లను తయారుచేస్తూ.. ఆంగ్లంలో ప్రావీణ్యం ఉన్న వృత్తి నిపుణులను అందిస్తూ అంతర్జాతీయ ప్రతిభా ఫ్యాక్టరీగా భారత్ ఉందని స్పష్టం చేశారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) రంగాల్లోని భారతీయ వృత్తి నిపుణులు.. పరిశోధన, ఇంజినీరింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నూతన సాంకేతికతలైన ఏఐ, క్వాంటమ్‌ల వంటి వాటిలో అంతరాన్ని పూడుస్తున్నారని తెలిపారు.

గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల, అడోబ్ చీఫ్ శంతను నారాయణ్ లాంటి వారు అమెరికాకు వెన్నెముకగా ఉన్నారని అభిప్రాయపడ్డారు.




## భారీ వర్షాలున్నాయి.. అప్రమత్తంగా ఉండండి: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## జూబ్లీహిల్స్ ఎన్నిక.. సర్వే చేస్తున్నాం.. టికెట్ అలా నిర్ణయిస్తాం: మ హేష్ కుమార్ గౌడ్



ఢిల్లీ, సెప్టెంబరు 25 : జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. ఇవాళ(గురువారం) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహ పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇవాళ (గురువారం) మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు...** 'హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు ఆగిపోయింది.

తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తోంది. పీసీసీ పాదయాత్ర సీఎం రేవంత్ రెడ్డికి, ఇన్‌చార్జ్ మీనాక్షి నటారాజన్‌కి తెలియకుండా చేశారని కొందరు గతంలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది. బీఆర్ఎస్ మళ్లీ పునర్జీవం పోసుకోదు. ఏం చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి బీజేపీ నాయకులకు ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపొచ్చు ' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## తెలంగాణ ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో తొలి దశ ప్రాజెక్టు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్టు రానుంది. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్అండ్‌టీ సీఎండీ మధ్య అంగీకారం కుదిరింది. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఎల్అండ్‌టీకి ఉన్న రూ. 13వేల కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు సంసిద్ధత తెలిపినట్టు సమాచారం. ఎల్అండ్‌టీకి రూ. 2,100 కోట్లు నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణ నుంచి ఆ సంస్థ వైదొలగనుంది. హైదరాబాద్ మెట్రో 69 కి.మీ. మొదటిదశని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. 22 వేల కోట్లతో నిర్మించిన విషయం తెలిసిందే.

# స్థానిక సంస్థల ఎన్నికలకు.. సర్కారు సిద్ధం..!

## అతి త్వరలోనే షెడ్యూల్!




హైదరాబాద్ : లోకల్ బాడీ ఎలక్షన్స్ కు తెలంగాణ సర్కార్ రెడీ అవుతోంది. ఎన్నికల నిర్వహణకు స్పెషల్ జీవోతోనే ముందుకు వెళ్లేందుకు సిద్ధం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ ను కూడా దసరా లోపే రిలీజ్ చేయనున్నట్లుగా తెలుస్తోంది.

ఈ మేరకు ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లుగా తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్రం ఎటూ తేల్చకపోవడంతో పెంచిన రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(బీ)లో చేసిన సవరణలతో జీవో జారీ చేయాలని సర్కార్ ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. దసరా లోపు షెడ్యూల్ విడుదలకు వీలుగా రెండు రోజుల్లోగా రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లకు ఇటీవల జరిగిన సమావేశంలో సీఎం ఆదేశాలు జారీ చేసినట్లుగా సమాచారం. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించిన వెంటనే ఆయా స్థానాల వారీగా ఖరారు చేసిన రిజర్వేషన్లను జిల్లాల వారీగా ప్రకటించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కూడా కలెక్టర్లకు సూచించినట్లుగా తెలుస్తోంది.

**సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం...** కాగా రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన సమాచారం మొత్తాన్నీ ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అందించింది. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం చూస్తే బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వంఏర్పాటైన తరువాత 2024లో నిర్వహించిన కులగణన వివరాల ప్రకారం ఖరారు చేయాలని కలెక్టర్లకు సూచించింది. ఆ వివరాలన్నింటినీ కలెక్టర్లు అతి త్వరలో నిర్వహించే సమావేశంలో క్షేత్రస్థాయి అధికారులకు అందించి రిజర్వేషన్లను ఖరారు చేయాలని సూచించనున్నారు. కాగా స్థానిక ఎన్నికల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒకటి రెండు రోజుల్లోరోజుల్లో కీలక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిసింది. ఆ సమావేశంలో ఎన్నికల నిర్వహణ విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే స్థానిక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అవుతుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసింది .తాజా వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామపంచాయతీలు, 565 మండలాలు, 31 జిల్లాలు ఉన్నాయి. 1,12,534 మంది వార్డు సభ్యులు ఉండగా.. 5,763 ఎంపీటీసీలు, 565 మండల ప్రజా పరిషత్తులు, 31 జిల్లా ప్రజాపరిషత్తులు ఉన్నాయి. వీటి ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు.

# సంపాదకీయం

## లద్దాఖ్ రగులుతోంది... బీజేపీకి కొత్త సవాల్...

ఇది విచిత్రమైన వ్యవహారంగానే అంతా చూస్తున్నారు. కాశ్మీర్ ఎపుడూ ఉద్రిక్తలకు నిలయంగా ఉంటుంది. అక్కడే ఎక్కువగా అలజడులు రేగుతూ ఉంటాయి. కానీ మంచుతో మంచిగా ఉంటే ఉండే లద్దాఖ్ మంటెక్కిపోవడం, వేడెక్కిపోవడం మాత్రం ఇపుడు అతి పెద్ద చర్చకు దారి తీస్తోంది లద్దాఖ్‌కు రాష్ట్ర హెూదా కావాలని డిమాండ్ చేస్తూ గతా పక్షం రోజులుగా సాగుతున్న ఆందోళన కాస్తా హింసాత్మకంగా మారింది. ఘర్షణలు సైతం చెలరేగడంతో నలుగురు యువకులు మరణించారు. బీజేపీ ఆఫీసుకు నిప్పంటించిన ఆందోళకారులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంటున్నారు.

**రాష్ట్ర హెూదా ఇవ్వాల్సిందే :** లద్దాఖ్‌కు రాష్ట్ర హెూదా అలాగే ఇవ్వాల్సిందే అన్నది ప్రధాన డిమాండ్ గా చేసుకుని ఈ నెల 10 నుంచి అక్కడ ఆందోళనలు సాగుతున్నాయి. పదిహేను మంది దాకా ఆందోళనకారులు అమరణ దీక్ష కూడా చేస్తున్నారు. అదే విధంగా ఆరో షెడ్యూల్ పొడిగింపుని కూడా ఆందోళనకారులు కోరుతున్నారు. ఇక అమరణ దీక్షలో ఉన్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలోనే లద్దాఖ్ అపెక్స్ బాడీ యువజన విభాగం భారీ ఎత్తున ఆందోళనలకు పిలుపు ఇచ్చింది.

**మండుతున లేహ్ నగరం :** ఎపుడూ కూల్ గా ప్రశాంతంగా ఉండే లేహ్ నగరం ఇపుడు ఆందోళనలతో అట్టుడుకుతోంది. పెద్ద ఎత్తున ఆందోళనకారులు వీధుల్లోకి రావడమే కాదు భద్రతాదళాలను లక్ష్యంగా చేసుకుని రాళ్ళు రువ్వడంతో పాటు ఏకంగా పోలీసుల వాహనాలకే నిప్పు పెట్టారు. అంతే కాదు బీజేపీ ఆఫీసుని తగులబెట్టారు. దాంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించారు. ఇక ఆందోళనకారులు పోలీసుల మధ్యలో ఘర్షణ చెలరేగడంతో ఫైరింగ్ చోటు చేసుకుంది. దీంతో నలుగురు యువకులు చనిపోగా మరో ముప్పయి మంది దాకా ఆందోళనకారులు గాయాలపాలు అయ్యారు.

**లద్దాఖ్లో మొదటిసారిగా :** ఇంతటి ఉదిక్తత చోటు చేసుకోవడం అన్నది లద్దాఖ్లో ఇదే మొదటిసారిగా చెబుతున్నారు. రాష్ట్ర హెూదా అంటూ యువత అమరణ దీక్షలకు దిగడంతోనే వాతావరణం మారిపోయింది. రాష్ట్ర హెూదా వస్తే తమ బతుకులు బాగుపడతాయని యువత ఈ ఉద్యమాన్ని చేస్తోంది. అయితే ఈ ఉద్యమానికి ప్రముఖ వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన శాంతి యుతంగానే అంతా జరగాలని కోరుకుంటున్నా యువతలో ఆవేశం పరిస్థితిని ఇలా దిగజార్చింది అని అంటున్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం సైతం అప్రమత్తం అయింది. లద్దాఖ్లో డిమాండ్ల మీద చర్చించేందుకు ప్రతినిధులను అక్టోబర్ 5న ఢిల్లీకి ఆహ్వానించింది. ఇంతలోనే మరో రూపునకు ఉద్యమం దారి తీసింది అని అంటున్నారు.

**ఆరేళ్ళ తరువాత :** ఇక 2019 ఆగస్ట్ వరకూ జమ్మూ అండ్ కాశ్మీర్ రాష్ట్రంగా ఉండేది ప్రత్యేక ప్రతిపత్తి కూడా కల్పించారు. అదె ఏడాది ఆగస్ట్ 5న ఆర్టికల్ 370 ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అంతే కాదు కాశ్మీర్ లద్దాఖ్ లని కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసింది. ఆ తరువాత నుంచి లద్దాఖ్ ని ప్రత్యేక రాష్ట్ర హెూదాతో వేరేగా ప్రకటించాలని డిమాండ్లు ఉన్నాయి. రాష్ట్ర హెూదా ఇచ్చి భారత రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ చేర్చాలనే డిమాండ్ ఉంది. అదిపుడు మరింతగా ఊపందుకుంది. దాంతోనే ఈ విధం గా మంచు కొండల మధ్య మంటలు పుట్టాయని అంటున్నారు. కేంద్రం ఈ మంటలను ఆర్పేందుకు ఏ రకమైన ప్రయత్నాలు చేస్తుందో చూడాల్సి ఉంది.

# సహకార సంఘాన్ని సందర్శించిన యూనివర్సిటీ విద్యార్థినులు







శామీర్ పేట, సెప్టెంబర్ 25(గరుడ వార్త) : యూనివర్సిటీ విద్యార్థినులు వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. సహకార యూనియన్ అధికారులు, సహకార శాఖ అధికారులు, కోఠి లోని చాకలి ఐలమ్మ మహిళ యూనివర్సిటీ కళాశాల విద్యార్థినులు శామీర్ పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. సంఘ చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి, సంఘం లావాదేవీలను, సంఘం అభివృద్ధి గురించి విద్యార్థినులకు వివరించారు. పాలక వర్గ సమిష్టి సహకారం తో సంఘం యొక్క పాత భవనం, సెంట్రల్ బ్యాంక్ నుంచి డీసీసీబీ బ్యాంకు కు మారిన పరిస్థితులు, సంఘాన్ని అభివృద్ధి, సౌకర్యాల గురించి, ఫార్మ్ రైజ్ వన్ ప్రాజెక్ట్ గురించి తెలియజేశారు. రైతులు దళారి వ్యవస్థ బారిన పడకుండా రైతులను ఈ సంఘం ఎలా ఆదుకుంటుందో విద్యార్థులకు తెలిపారు. రైతులకు నాణ్యమైన మందులు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులను ఈ సంఘం నుంచి గ్రహించిన విషయాలను వారి గ్రామాలలోని రైతులకు తెలియజేసి వారిని చైతన్య పరచాలని చైర్మన్ కోరారు. అనంతరం సహకార శాఖ అధికారులు మాట్లాడుతూ శామిర్ పేట సహకో సంఘం చైర్మన్ డాక్టర్ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మంచి ప్రయోజనాలు అందుతున్నాయని ప్రశంసించారు. ఇక్కడికి రావడం వల్ల తమకు సహకార సంఘాలు, రైతులు దళారీల బారిన పడకుండా ఆదుకున్న విధానం, సంఘాల ప్రముఖ్యత తెలిసిందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార యూనియన్ అధికారులు సురేఖవాని, ప్రమీలరాణి, భార్గవి, జిల్లా సహకార అధికారి వెంకట్ రెడ్డి, సంఘ డైరెక్టర్లు వంగ భూమి రెడ్డి, ముద్దం ప్రతాప్ రెడ్డి, కొండ భిక్షపతి, లక్ష్మీ గారి నర్సింలు, దీరావత్ బాబు సింఘ్ నాయక్, సంఘం సీఈఓ రవీందర్ , సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవలో భాగంగా పెద్ద చెరువు వద్ద క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించిన మున్సిపల్ సిబ్బంది



శామీర్ పేట, సెప్టెంబర్25( గరుడ వార్త) : స్వచ్ఛత హి సేవ 2025 కార్యక్రమంలో భాగంగా శామీర్ పేట పెద్ద చెరువు పరిసరాలను తూముకుంట మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. గురువారం స్వచ్ఛత హి సేవ 2025 కార్యక్రమంలో భాగంగాఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ అనే అంశం పై శామీర్ పేట పెద్ద చెరువు వద్ద తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగకు ఊరెళ్తున్నారా.. అయితే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

### బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి



బాలానగర్ : రానున్న దసరా, బతుకమ్మ పండుగలకు పిల్లలకు సెలవులు ఒడటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ కమీషనరేట్ పరధిలోని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'దసరా పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నమన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో బాలానగర్ డివిజన్ అన్ని పోలీస్ స్టేషన్ లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఏసీపీ రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు.

**పండుగలకు ఊరెళ్లే వారికి పోలీసుల సూచనలు..**

సైబరాబాద్ కమిషనరేట్ లో పోలీసులు నిఘానేత్రం కింద ప్రజలు, కార్పొరేట్ కంపెనీల సీఎస్ఆర్ సహకారంతో ఇప్పటికే సీసీటీవీ లను ఇన్ స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను చేదించామని, ప్రజలు కూడా తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలివిలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా, లాకర్ తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్తే మంచిది. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ తో మూసివేయాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్, పాల వారిని రావద్దని చెప్పాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలి. రద్దీగా ఉన్న బస్సులలో ప్రయాణిస్తున్నప్పుడు, తమ విలువైన వస్తువులను తమ వద్ద జాగ్రత్త పరుచుకోవాలి, బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం. హెూమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా లైవ్/ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటికి సంబంధించిన నాణ్యమైన సిసిటివి లు (షాయోమీ వంటి కంపెనీలు తక్కువ ధరకే) ఆన్లైన్/మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయి. హెూమ్ సెక్యూరిటీ సర్వైలెన్స్‌కు ఇవి ఎంతో ఉపయుక్తం. ఇంటి భద్రతాపరంగా ఇంటికి దృఢమైన, నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ గోద్రెజ్ హై సెక్యూరిటీ లాక్ సిస్టం ని వాడడం మంచిది. తాళం వేయడం కంటే గోద్రెజ్ డోర్ లాక్ చేయడం వల్ల ఇంట్లో మనుషులు ఉన్నారా? లేరా? అనేది తెలియదు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.

## కాసుల కక్కుర్తి.. వాహనాల్లో కుక్కి!

గంగాధర: వ్యవ'సాయం'లో అన్నదాతలకు చేయూతనందించిన పశువులు వయసు మీద పడటంతో ఏ పనీ చేయలేక భారంగా మారుతున్నాయి. ఈ మధ్య కాలంలో సాగులో యాంత్రీకరణతో పశువుల వినియోగం తగ్గింది. ఈ కారణాలతో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. దీనిని గమనించిన కొందరు దళారులు వారసంతల్లో నిత్యం పశువులను కొనుగోలు చేస్తూ కబేళాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పశువులను వాహనాల్లో ఎక్కించి, దింపే సమయాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కదలాడానికి స్థలం లేకుండా చిన్న చిన్న వ్యాన్లలో వందల కిలోమీటర్లు తరలిస్తున్నారు. ఒకదానిపై ఒకటి కుక్కి మరీ తరలిస్తున్నారు. ఊపిరాడక మూగ జీవులు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. వాహనాల నుంచి కింద పడిపోయి గాయాలైన సంఘటనలున్నాయి. ఈ సమయాల్లో మూగజీవుల బాధ



తీవ్రంగా ఉంటుంది.

**రూ.కోట్లలో వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలోని గంగాధర, సుల్తానాబాద్, గర్రెపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, నుస్తులాపూర్, ధర్మారం మండలం రాజారాంపల్లి, చొప్పదండి, బెజ్జంకి, మెట్‌పల్లి, ఎల్లారెడ్డిపేట వారసంతల్లో పశువుల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క గంగాధర వారసంతలోనే ప్రతి శనివారం 600 నుంచి 800 పశువుల విక్రయాలు జరుగుతుండగా దాదాపు రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతోందని అంచనా. నేరుగా గ్రామాల్లో రైతుల వద్దకు వ్యాపారులు వెళ్లి పశువులను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వారసంతల్లోకి వాహనాల్లో తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది దళారులు వ్యాన్లలో కేరళ, నాందేడ్, మహరాష్ట్ర, మెదక్, హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, ఇతర ప్రాంతాల కబేళాలకు తరలిస్తున్నారు. దీంతో రోజురోజుకూ పశుసంపద తగ్గిపోతోంది.

## వణికిస్తున్న డెంగీ.. మలేరియా

కొత్తగూడెం: జిల్లాలో డెంగీ, మలేరియా కోరలు చాస్తోంది. కేవలం 12రోజుల వ్యవధిలో మలేరియా పాజిటివ్ కేసులు 43, డెంగీ కేసులు 34 నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టు 19నాటికి మలేరియా 11, డెంగీ 54 కేసులుండగా.. ప్రస్తుతం మలేరియా 54, డెంగీ 88గా నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ముసురుతో కూడిన వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. వైరల్ జ్వరాలు, జలుబులతో పాటు విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ఆళ్లపల్లి మండలంలో డెంగీ కేసులు అధికంగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**జులైలో అయిదు.. ఆగస్టుకు 88**

జిల్లాలో నెల వ్యవధిలోనే పరిస్థితులు మారిపోయాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు డెంగీ కేసులు ఐదు నమోదు కాగా.. ఆగస్టు చివరి నాటికి అవి 88కి చేరాయి. కేవలం ఒక్క నెలలోనే 83 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ అధికారిక లెక్కలు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇతర నగరాల్లో చికిత్స పొందుతున్న జిల్లా వాసులు అనధికారికంగా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇవి కాకుండా జలుబు, దగ్గు, తీవ్ర ఒళ్లు నొప్పులు, కళ్లమంట, శ్వాస సంబంధిత వ్యాధి బాధితులు జిల్లా సర్వజనాసుపత్రికి బారులుదీరుతున్నారు. ఇంటో ఒకరు వ్యాధి బారిన పడితే వరుసగా కుటుంబ సభ్యులందరికీ వ్యాపిస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లేమి, నిధుల కొరత, తేమ వాతావరణం కారణంగా సెప్టెంబరులోనూ సమస్య తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పడకేసిన పారిశుద్ధ్యం**

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తోడు.. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏజెన్సీలో ఇదే సమస్యతో వ్యాధులు ప్రబలుతున్నట్లు అర్థమవుతోంది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా దోమల నివారణ చర్యలను గాలికొదిలేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కల్పన ఆశించిన స్థాయిలో లేకపోవటం



ప్రతికూలంగా మారింది. జిల్లాలో మలేరియా హైరిస్క్ విభాగం కింద 80గ్రామాలు, డెంగీ హైరిస్క్ విభాగం కింద 162 గ్రామాలు ఉన్నట్లు అధికారులు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం.

**స్వీయ సంరక్షణ చర్యలే కీలకం**

వ్యాధులు విజృంభించకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడాలి. వర్షాకాలంలో కాచివడపోసిన నీటిని తాగడం ఉత్తమమని, వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను తీసుకోవాలని, జ్వరం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో కేసులు
మలేరియా: 54
డెంగీ: 88

'వైద్యశాఖ పరంగా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. ఇంటింట జ్వర సర్వే నిర్వహించి, పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయిస్తున్నాం.' డా.స్పందన, మలేరియా జిల్లా ప్రోగ్రాం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# మాధ్యమ వైద్యం.. అనారోగ్యం తథ్యం

సూర్యాపేట :నల్గొండకు చెందిన వ్యక్తి అనారోగ్య (కిడ్నీలో రాళ్లు) సమస్య పరిష్కారానికి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోను ప్రామాణికంగా తీసుకొని ప్రయత్నించాడు. అది కాస్తా ఇన్‌ఫెక్షన్ తీవ్రతను పెంచింది. తుదిగా సరైన వైద్యుడిని సంప్రదించడంతో కోలుకున్నాడు.సూర్యాపేటకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బరువు తగ్గించుకునేందుకు సామాజిక మాధ్యమాల వీడియోల ఆధారంగా కఠిన నియమాలు పాటించాడు. మూడు నెలలు పండ్ల రసాలు తాగుతూ వ్యాయామం చేశాడు. అనారోగ్యం బారినపడి ఆసుపత్రిలో చేరాడు. మూడేళ్ల బుడతడి నుంచి 80 ఏళ్ల వృద్ధుడి వరకు చరవాణి వినియోగం సాధారణంగా మారింది. అధునాతన ఫోన్లు రావడంతో సామాజిక మాధ్యమాల వినియోగం మితిమీరింది. ఇవే పలు సందర్భాల్లో కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాయి.

**కచ్చితత్వం ఉంటేనే..**

సామాజిక మాధ్యమాల గురించి నేటి తరానికి చెప్పాల్సిన అవసరం లేదు. వీటిల్లో వచ్చేవాటికి లైకులు కొట్టేవారు భారీగానే ఉంటున్నారు. మరికొందరు అంతకుమించి ఆలోచిస్తున్నారు. జీవనశైలి, విద్య, వైద్యం, ఉపాధి ఉద్యోగం.. ఇతర రంగాల్లోని అవకాశాలు, సూచనలు, హిత వచనాలు చెప్పే తీరుకు ఆకర్షితులవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. నిజమేదో తెలుసుకోవాలి. వైద్య సేవల విషయంలో కచ్చితత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. నైపుణ్యం, అనుభవం, అర్హత లేని వారి సూచనలను నమ్మొద్దు. ఔషధాలు, ఆకు పసర్లు, నాటు వైద్యం సూచనలు పాటించొద్దు.



ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫోన్లు వాడే వారిలో 80 శాతానికి పైగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నట్లు ఒక అంచనా. తల్లిదండ్రుల్లో అత్యధికులు పిల్లలు అడిగిందే తడవుగా.. అతి గారాబంతో ఫోన్లు అందిస్తున్నారు. విజ్ఞాన సంబంధిత అంశాలను ఔపోసన పట్టడంలో తప్పులేదు. కానీ ఇందుకు విశ్వ వేదికలు వినియోగించాలి. సందేహాలుంటే నిపుణులను ఆశ్రయించాలి.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్త: డాక్టర్ భవానీసాగర్, నాంపల్లి

ఆహారం, ఆరోగ్యం, వైద్యం విషయంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే సూచనలు నమ్మొద్దు. సోషల్ మీడియాలో సూచించిన ఔషధాలు వాడి అనారోగ్యం కొని తెచ్చుకోవద్దు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి. అర్హత, అనుభవమున్న వైద్యులను సంప్రదించాలి.

# పండక్కి ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!



సూర్యాపేట : దసరా సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు వచ్చాయి. దీంతో చాలామంది విహార యాత్రలకు, స్వగ్రామాలకు, శుభకార్యాలకు, అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వెళ్తుంటారు. అదే అదునుగా భావించి దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించే అవకాశం ఉంది. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు దసరా సెలవుల్లో పలు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

**చరవాణి స్టేటస్‌లతోనూ..**

ముఖ్యంగా అత్యధికులు ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్న విషయాన్ని వెంటనే సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటారు. విహార యాత్రకు సంబంధించిన ఫొటోలను స్టేటస్‌లో పెట్టేస్తుంటారు. ప్రస్తుతం ఇలాంటి విషయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రయాణం పూర్తయ్యాక, ఇంటికి తిరిగి వచ్చిన తరువాతనే ఫొటోలు, సమాచారం షేర్ చేయాలని సూచిస్తున్నారు.

**ఇవి పాటిస్తే మేలు**ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదు ఇంట్లో ఉంచి వెళ్లొద్దు. బ్యాంకు లాకర్లో భద్రపర్చుకోవడం లేదా వెంట తీసుకెళ్లడం మంచిది. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు, అత్యాధునిక అలారం సిస్టంలు ఏర్పాటు చేసుకుంటే మంచిది. బీరువా తాళం ఇంట్లోనే ఏదో ఒక చోట భద్రపర్చి వెళ్లొద్దు. వాహనాల తాళాలు కనిపించకుండా భద్రపర్చుకోవాలి. ప్రధాన గేటుకు తాళం వేసిన ఇళ్లను దొంగలు సులభంగా పసిగట్టే అవకాశం ఉంటుంది. రోడ్డు వైపున కాకుండా పక్క వైపున ఉన్న తలుపునకు తాళం వేయాలి. లోపల గదిలో ఒక లైటు వేసి ఉంచాలి. బంగారు ఆభరణాలతో వెళ్తున్నపుడు బస్సులు, రైళ్లు ఎక్కే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలి. రద్దీ వేళ దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతుంటారు. ప్రయాణాల్లో అపరిచిత వ్యక్తులు ఇచ్చే ఆహార పదార్థాలు తినవద్దు. శివారు ప్రాంతాల్లో అపరిచితులు ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి వేళ తాళం వేసి ఇళ్లలో చోరీలకు పాల్పడతారు. అలాంటి కాలనీల్లో గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి.

ప్రత్యేక నిఘా ఏర్పాటు: నరసింహా, ఎస్పీ, సూర్యాపేట

దసరా సెలవుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళ గస్తీని పెంచేలా చర్యలు చేపట్టాం. ప్రజలు తమ వస్తువులు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువ రోజులు ఊరెళ్లేవారు ఠాణాలో సమాచారం ఇవ్వాలి.

# నిధులకు గండి.. వివరాలు చూపండి



సిరిసిల్ల : రోగుల వివరాల నమోదులో సమస్యలు ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల్లో భాగంగా చికిత్సల పరిధి విస్తరించింది. ఖర్చును కూడా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. దీంతో జిల్లా, వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. అందుకు తగినట్లుగా ప్రభుత్వం వైద్యులు, చికిత్సలు, సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. రోగి వివరాల నమోదులో ఆధార్, రేషన్‌కార్డులను జతచేయటం సమస్యగా మారింది. కార్డుల్లో తప్పులు ఉండటం, ఈకేవైసీ తదితర కారణాలతో ఆరోగ్యశ్రీ నిధుల కోసం రోగుల వివరాలు నమోదు కావటం లేదు. జిల్లా, మండల స్థాయిల్లో పాలకవర్గాలు లేక హెచ్‌డీఎస్(హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) నిధులు గత డిసెంబరు నుంచి నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నుంచి మాత్రమే విడుదల అవుతున్నాయి.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం** జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు వైద్య విధాన పరిషత్తు(టీవీవీపీ) పరిధిలో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట(సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధుల సీజన్ కావటంతో జిల్లా ఆసుపత్రిలో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రోజుకు సగటున 1200 ఓపీ నమోదు అవుతోంది. ఈ లెక్కన నెలకు ఆసుపత్రిలో ఉంటూ చికిత్సలు పొందుతున్న వారు 1500పైనే ఉంటారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 500 మంది వరకు చికిత్స పొందుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో సేవలు పొందుతున్న వారిలో సగానికి పైగా రోగులు ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురాకపోవటం.. తెచ్చినా వాటిల్లో తప్పులతో వివరాలు సరిగ్గా నమోదవటం లేదు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకునేవారి వివరాల నమోదుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేటలో పడకల సంఖ్య తక్కువగా ఉండటంతో చికిత్సలు నామమాత్రంగా జరుగుతున్నాయి.

**80 శాతం ఆస్పత్రుల అభివృద్ధికే..**

జిల్లా జనరల్, వేములవాడ ప్రాంతీయ దవాఖానాల్లో రోగులకు పెద్ద ఎత్తున వైద్య సేవలు అందుతున్నాయి. విషజ్వరాలు, డెంగీ, ఇతర శస్త్రచికిత్సలు చేసినవాటికి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ఆరోగ్యశ్రీ నుంచి నిధులు వస్తుంటాయి. అందులో 20 శాతం ట్రస్టులో ఉంచుకుని మిగతా 80 శాతం నిధులను ఆసుపత్రుల్లోని హెచ్‌డీఎస్ ఖాతాలో జమ చేస్తారు. వాటిలో 35 శాతం చికిత్సలు అందించిన విభాగాల్లో పనిచేసిన సిబ్బందికి ప్రోత్సాహకంగా అందిస్తారు. మిగతా 65శాతం మందులు, శస్త్రచికిత్సల పరికరాలు, అత్యవసర పనులకు వినియోగించుకునే వీలుంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక పడకల ఏర్పాటు, ఏసీలు, ఎక్స్‌రే యంత్రాలు, వేములవాడ ఆసుపత్రిలో మోకీలు మార్పిడికి ఉపయోగించే పరికరాలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. 2024 డిసెంబరు నుంచి ప్రభుత్వం ఈ నిధుల విడుదలతో జాప్యం చేస్తోంది.

# సగంలోనే.. సాగు సర్వే




నకిరేకల్: పంటల సాగుకు సంబంధించి కచ్చితమైన సమాచారం సేకరించేందుకు ప్రతి సీజన్‌లో ప్రభుత్వం ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్‌ను నిర్వహిస్తుంది. వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్ ద్వారా రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుత వానాకాలం సీజన్ ముగిసే దశకు వస్తుంది. పత్తి, ధాన్యం కొనుగోలు సీజన్ త్వరలో మొదలు కానుంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ముందస్తు కసరత్తును జిల్లా అధికారులు పూర్తి చేస్తున్నారు. సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంటేనే రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని, ధాన్యాన్ని విక్రయించుకునేందుకు వీలుంటుంది. నమోదు లేకుంటే ఆయా కేంద్రాల్లో రైతుల పంటలను కొనేందుకు నిరాకరిస్తారు. ఇంత కీలకమైన పంటల నమోదు సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. కొనుగోలు సీజన్ ముంచుకొస్తున్నా.. సర్వే యాభై శాతానికి కూడా చేరుకోకపోవడం గమనార్హం.

రైతుల పొలాలు సందర్శించి సర్వే నెంబర్ల వారీగా పంటల సాగు వివరాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవోలు) నమోదు చేస్తారు. యూరియా సరఫరా పర్యవేక్షణ, టోకెన్ల జారీ తదితర పనుల్లో ఇంత కాలం ఏఈవోలు బిజీగా ఉండటంతో క్షేత్రస్థాయిలో సాగు సర్వే ముందుకు సాగడం లేదన్న అభిప్రాయాలున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం ఈ సర్వేను శాటిలైట్ ద్వారానే చేపట్టాలని ముందుగా నిర్ణయించినా.. ఆ తర్వాత మళ్లీ ఏఈవోలకు అప్పగించడంతో ప్రక్రియ ఆలస్యంగా మొదలైందని అధికారులు అంటున్నారు.**వచ్చేనెల 15 నాటికి పూర్తి: పి.శ్రావణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ**

ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ సర్వేను వచ్చేనెల 15 నాటికి పూర్తిచేయాలని ఎంఏవోలు, ఏఈవోలకు ఆదేశాలిచ్చాం. ఇప్పటి వరకు యూరియా పంపిణీపైనే క్షేత్రస్థాయిలోని సిబ్బంది పనిచేయడంతో పంటల సాగు సర్వే కొంత ఆలస్యమైంది. సర్వేలో వేగం పెంచేందుకు రోజువారీ లక్ష్యాలు నిర్ణయిస్తాం.

# ఈత.. కావొద్దు గుండె కోత



మిర్యాలగూడ : సెలవులు వచ్చాయంటే పిల్లల ఆటలకు అంతే ఉండదు. అనేక మంది పిల్లలు, యువత సెలవుల్లో అధికంగా ఈతకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈత కొట్టడం సరదాగానే ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కాల్వలు, చెరువులు, నీటి కుంటలు, వ్యవసాయ బావుల వద్ద ఈతకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆయా ప్రాంతాల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో చిట్యాల మండలం ఏపూర్‌లో సెలవు రోజు వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ...**

ఈత వచ్చినా సరే కొత్త ప్రాంతాల్లో లోతు తెలుసుకున్నాకే ఈతకు దిగాలి. అడుగున బురద ఉండే నదులు, చెరువుల్లో జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే బురదలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను చెరువులు, నదులు, కాల్వలు, వ్యవసాయ బావులకు ఈతకు పంపించొద్దు. ఈత వచ్చినా సేఫ్టీ జాకెట్ వంటివి వాడడం ఉత్తమం. అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలి. జలాశయాల వద్ద అక్కడి పరిస్థితిని వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయడం మంచిది.

**నిండుగా జలాశయాలు..**ఇటీవల కురిసిన వర్షాలు, కాల్వల ద్వారా వస్తున్న నీటితో ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులు, జలాశయాలు, నదులు, కాల్వలు, వ్యవసాయ బావులు తదితర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. సాగర్ ఎడమ కాల్వలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఈత వచ్చిన వారు సైతం కాల్వలో పడితే బయటకు రావడం గగనమే. ఇటీవల కాల్వలో పడిన అనేక మంది శవాలై తేలారు.

**సాగర్ ఎడమకాల్వలో యువకుడి గల్లంతు**

ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో యువకుడు గల్లంతైన సంఘటన మండల పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్ (32) గ్రామానికి చెందిన నలుగురు బాలురతో కలిసి సోమవారం గ్రామ శివారులోని ఎడమకాల్వలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో అందులో ఓ బాలుడు ఈత సరిగా రాక నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా సతీష్ బాలుడిని కాపాడి ఒడ్డుకు చేర్చి ఆయాసానికి గురై నీటి ప్రవాహంలో ఒక్కసారిగా గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందించగా కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. సతీష్ తమ్ముడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**పర్యవేక్షణ ఉండాలి..: రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ.**

పిల్లలను సెలవుల్లో చెరువులు, కాల్వలు, కుంటలకు ఈతకు ఎట్టి పరిస్థితుల్లోనూ పంపకూడదు. ఈత కొట్టాలంటే అన్ని అనుమతులు, వసతులు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే ఈతకు వెళ్లాలి. ఈత కొట్టేటప్పుడు పోటీలు పెట్టుకోవడం, ఈత రాకపోయినా ఎక్కువ లోతుకు వెళ్లడం వంటివి చేయకూడదు.

# లంచం.. దశావతారం

మిర్యాలగూడ : లంచం.. ఈ రెండక్షరాల అవినీతి పదం వినిపించని శాఖ, కార్యాలయం లేదు. ఏ పని కావాలన్నా, ఫైలు ముందుకు కదలాలన్నా..చివరికి విద్యుత్తు మీటరు కావాలన్నా.. ఆమ్యామ్యాలు సమర్పించుకోవాల్సిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఏసీబీ కేసులే ఇందుకు నిదర్శనం. గతేడాది దసరా పండుగ నుంచి ప్రస్తుతం వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 మందిపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు.

**పది శాఖల్లో ఏసీబీ తనిఖీలు...**

గతేడాది దసరా పర్వదినం నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పది శాఖలపై ఏసీబీ దాడులు చేసింది. వీటిలో పదమూడు ఘటనల్లో 15 మందిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకొని కటకటాల్లోకి పంపారు. వీటిలో అత్యధికంగా పోలీస్ శాఖపై మూడుసార్లు దాడులు చేసి ఓ డీఎస్పీ, ఓ సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఒక కానిస్టేబుల్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రెవెన్యూ శాఖలో సైతం మూడుసార్లు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వాటిలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక విద్యుత్తు, మిషన్ భగీరథ, పౌర సరఫరాలు, అటవీ, మత్స్యశాఖ అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.ఈ ఏడాది ఏప్రిల్ 4న సూర్యాపేట జిల్లాలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు అందులో సమయపాలన, తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపగా గతేడాది డిసెంబరు 4న వాడపల్లి అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రూ.86,600 నగదు స్వాధీనం



చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి, మే, జూన్, ఆగస్టు నెలల్లో రెండు చొప్పున ఏసీబీ కేసులు నమోదు కాగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జులై, సెప్టెంబరులో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

**ఇలా ఫిర్యాదు చేయండి..**ఏ శాఖలోని సిబ్బంది, అధికారులు సేవలు అందించేందుకు డబ్బు డిమాండ్ చేస్తే తక్షణమే ఏసీబీ అధికారులను సంప్రదించవచ్చు.ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించవచ్చు 94404 46106 వాట్సప్ నంబర్‌కు వివరాలు పంపించవచ్చు. సామాజిక మాధ్యమాల్లోని ఏసీబీ పేజీల్లో సైతం ఫిర్యాదు చేయవచ్చు.

# పేట.. ఆయిల్‌పామ్ సాగులో మేటి..

అశ్వారావుపేట: ఆయిల్‌పామ్ తోటల విస్తరణలో దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట వైపు చూస్తోంది. ఐదేళ్లలో ఎన్నడూ లేని రీతిలో రైతులు ఆయిల్‌పామ్ తోటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈఓ) పథకంలో భాగంగా దేశంలో వివిధ రాష్ట్రాలకు 2021 నుంచి ఐదేళ్ల కాలానికి 3.22 లక్షల హెక్టార్ల తోటల విస్తరణ లక్ష్యాలు నిర్దేశించారు. తెలంగాణకు 1,24,300 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం నిర్దేశించారు. 78,869 (1,97,172.5 ఎకరాలు) హెక్టార్ల సాగుతో రాష్ట్రం ముందువరుసలో ఉంది. తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్ అత్యధికంగా సాగవుతోంది. అందులో 70 శాతం అశ్వారావుపేట నియోజకవర్గంలోని రైతులే ఆయిల్‌పామ్ తోటలు పెంచుతున్నారు.

**ఈ ఏడాది 4,700 ఎకరాల్లో..**ఈ ఏడాది అశ్వారావుపేట నియోజకవర్గంలోనే సుమారు 1,600 మంది రైతులు 4,700 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు వేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆయిల్‌పామ్ గెలలకు రూ.17 వేల నుంచి రూ.21 వేలు ధర పలకటం, ప్రస్తుతం రూ.19,107 ఉండటంతో రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ ముందుండాలని, తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా, అందులో అశ్వారావుపేట ముందుండాలనేదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రైతులకు టన్నుకు రూ.25,000 ధర వచ్చేలా కృషి చేస్తున్నట్లు వివరించారు.

# రామాలయం వసతి ధరల తగ్గింపు

భద్రాచలం: ఇది భక్తులకు తీపి కబురు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి వసతి కోసం ఆశ్రయిస్తే గదుల ధరలు తగ్గించి సత్రాలను కేటాయిస్తున్నారు. ఈ కొత్త విధానం సోమవారం అమల్లోకి వచ్చింది. రోజూ పదుల సంఖ్యలో యాత్రికులు వసతి పొందుతున్నారు. అన్ని రకాలుగా 150 గదులు ఉండగా ఏడాదికి రూ.1.40 కోట్ల ఆదాయం సమకూరుతుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, హనుమజ్జయంతి వంటి ఉత్సవాలకు సందడి కనిపించే వాటిలో వసతి విభాగం ముందు వరుసలో ఉంటుంది. సీజన్‌లో నెలకు రూ.10 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది.

**సామాన్య భక్తులకు ఊరట**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో రామాలయంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం రూ.1000కి పైగా రోజువారీ అద్దె ఉన్నవాటికే పన్ను వర్తిస్తుంది. ఏసీ లేని 90 గదులకు జీఎస్టీ పూర్తిగా రద్దయ్యింది. ఇవన్నీ రూ.700 లోపు అద్దెవే కావడంతో పన్ను పోటు తప్పింది. ఇంతకు ముందు రూ.672 ఉన్న గది అద్దె ఇప్పుడు రూ.600 అయింది. రూ.448 ఉన్న విభాగం రూ.400లకే లభిస్తుంది. ఏసీ గదులను 5 శాతం జీఎస్టీతో కేటాయిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1,120కి కేటాయించిన ఏసీ గది ప్రస్తుత ధర రూ.1,050. ఇది సామాన్య భక్తులకు సంతోషం కలిగిస్తుంది.

**నిత్యావసర సరకులపై దృష్టి**

రామాలయంలో వార్షిక ఆదాయం రూ.80కోట్ల మేర ఉండగా సంవత్సరానికి 24లక్షల మంది దర్శించుకుంటున్నారు. అన్నదానంతో పాటు ప్రసాదాల తయారీ ఇతర అవసరాలకు బియ్యం, నూనె, పప్పులు, నెయ్యి, పంచదార వంటివి ఏడాదికి రూ.10 కోట్లకు పైగా కొనుగోలు చేస్తున్నారు. హక్కులు పొందిన వ్యాపారులు వీటిని దేవస్థానానికి సరఫరా చేస్తున్నారు. ఇందులో కొన్నింటికి 12శాతం జీఎస్టీ ఉంది. కొత్త విధానం సరకులకూ వర్తించేలా చొరవ చూపుతే ఆస్థాయిలో ఖర్చులను నియంత్రించి దేవుడి ఆదాయం పెంచవచ్చు.

**ఈఓ కార్యాలయం విస్తరణ**

ఇరుగ్గా ఉన్న తన కార్యాలయాన్ని విస్తరించేందుకు ఈఓ దామోదర్‌రావు చర్యలు చేపట్టారు. దాతలు, భక్తులు, ప్రముఖులు ఈఓను కలిసేందుకు వస్తే కొంతమందికే ఇందులో చోటు దొరికేది. సరిపడా కుర్చీలు ఉండేవి కాదు. మిగతా వాళ్లు ఛాంబర్ వెలుపల వేచి చూడాల్సి వచ్చేది. ఈ సమస్యను ఈఓ గుర్తించి విస్తరణ విధులను ఇంజినీర్లకు కేటాయించారు.

# అధ్వాన రహదారులు.. అధికారులకు కనిపించవా!

సిరిసిల్ల : జిల్లా కేంద్రంగా సిరిసిల్ల పట్టణం రూపుదిద్దుకున్న తర్వాత నివాస గృహాలతో పాటు జనాభా క్రమంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు సమకూర్చటం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల వ్యయంతో అధికారుల పట్టణ నలుమూలల సీసీ రోడ్లు నిర్మించారు. నాణ్యత లోపమో.. నిర్వహణ నిర్లక్ష్యమో తెలియదు గానీ ప్రస్తుతం అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కొంత కాలానికే ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. జనావాసాలు, కార్మికవాడల్లో వరదనీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. కంకర తేలి ప్రమాదకరంగా



మారుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మున్సిపల్ అధికారులు కనీసం మరమ్మతులు(ప్యాచ్ వర్క్) చేయటం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసిన ధ్వంసమైన రోడ్లే దర్శనమిస్తున్నాయి.

**ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు**

పాత బస్టాండ్ నేతన్న కూడలి నుంచి వెంకంపేట ప్రభుత్వ పాఠశాల వరకు 40 అడుగులు రోడ్డును విస్తరించారు. పాఠశాల సమీపంలో వర్షపు నీరు నిలిచి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారి గుండానే మొదటి బైపాస్ రోడ్డు, అపైరల్ పార్కు, వైద్య కళాశాల, రెండు పడక గదుల సముదాయాలకు వెళ్తారు. దీంతో ఈ రోడ్డుపై రద్దీ అధికంగా ఉంటుంది. వాహనదారులు, బాటసారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. 21వ వార్డు గణేష్‌నగర్‌లో ప్రధాన మురుగు కాలువపైన వేసిన సీసీ రోడ్డు ఇటీవల వర్షాలకు కుంగింది. దీంతో రాత్రి సమయంలో కనిపించకపోవటంతో వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

# మెట్రోకు 3 ప్రతిష్ఠాత్మక పురస్కారాలు

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌ని మూడు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి. దిల్లీలో ఈ నెల 19న 'ఈటీ నౌ ఇన్‌ఫ్రా ఫోకస్ సమ్మిట్' కార్యక్రమంలో వీటిని ప్రదానం చేశారు. ఈ మేరకు మెట్రో రైల్ సంస్థ ఓ ప్రకటనలోవెల్లడించింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)- ఎడిటోరియల్ ఛాయిస్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్



పురస్కారాన్ని ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి అందుకున్నారు. దీంతో పాటు 'ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్' 26వ జాతీయ పురస్కారం, 53వ జాతీయ కైజెన్ కాంపిటీషన్‌లో 'రింగ్ మెయిన్ పవర్ సప్లై సిస్టమ్ విత్ ఇంటెలిజెంట్ జీఐఎస్ ప్యానల్ రీడిస్ట్రిబ్యూషన్' ప్లాటినం అవార్డును మెట్రో సొంతం చేసుకుంది.

# ఆశావహుల్లో ఉత్కంఠ

భువనగిరి: స్థానిక సంస్థల ఎన్నికల సందడి జోరందుకుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఆశావహుల కోరిక నెరవేరనుంది. ఓటరు జాబితా కూర్పు, అధికారులు రాజకీయ పక్షాలతో సమావేశాలు, పోలింగ్ కేంద్రాల పరిశీలన తదితర అంశాలన్నీ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా గ్రామాల్లో వార్డు సభ్యులు మొదలు సర్పంచి, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల రిజర్వేషన్లు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించడంతో అధికారుల్లో హడావిడి మొదలైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించనుండటంతో కొత్తగా ఏ స్థానం ఎవరికి రిజర్వు అవుతుందనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

**సమాచారమంతా హైదరాబాద్ నుంచే**

ప్రస్తుతం సమాచారమంతా హైదరాబాద్ ఉన్నతాధికారుల నుంచే రానుంది. బీసీ డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణనలో ఉన్న బీసీ జనాభా వివరాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా సమాచారం, వార్డులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల వారీగా సమాచారం ఇవ్వనున్నారు. ఆ లెక్కల ఆధారంగా రిజర్వేషన్ చేపట్టనున్నారు. రొటేషన్ పద్ధతిలో సీట్లు కేటాయించనున్నారు. గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్ కేటగిరీ ఈ సారి ఉండనట్లు తెలుస్తోంది. అందుకే రిజర్వేషన్లు మొదటి నుంచీ దడ పుట్టిస్తున్నాయి.

**ఇప్పటికే సేవా కార్యక్రమాలు..**

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనే ఆశావహులు గత కొంతకాలంగా ఫౌండేషన్ల పేర, వ్యక్తులపేర పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ధన, వస్తు, సదుపాయాల రూపేణా సహకారాలు అందిస్తూ ప్రజల్లో నిత్యం ఉండేలా చూసుకుంటున్నారు. తాజాగా రిజర్వేషన్ల అంశం తెరమీదకి రావడంతో పదవులు ఆశిస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో పలు దఫాలుగా వచ్చిన రిజర్వేషన్లను బేరీజు వేసుకుంటూ అనుయాయులతో లెక్కలు వేసుకుంటున్నారు. దసరా తర్వాత ఈ విషయంలో మరింత స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**జిల్లా వివరాలు..**

గ్రామ పంచాయతీల సంఖ్య : 428
ఎంపీటీసీ స్థానాలు : 178
ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు : 17
పోలింగ్ కేంద్రాలు : 1001

# తొలి రోజు ధరల తగ్గింపు అంతంతే!




కరీంనగర్ : వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాల్లో సంతోషం నింపింది. వివిధ శ్లాబుల్లో మార్పులు చేయడంతో ధరల తగ్గింపుపై మధ్య తరగతి జీవులు గంపెడాశలు పెట్టుకున్నారు. సంస్కరణలతో చాలా వస్తువులు సున్నా పన్ను పరిధిలోకి రావడం లేదా 5 శాతానికి తగ్గించడం వినియోగదారుడికి ప్రయోజనకరంగా మారింది. జీఎస్టీ 2.0లో మొత్తంగా 375 రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. కాగా ప్రభుత్వం ప్రకటించినట్లుగా సత్వరమే ఇవి అమలు లోకి రావాల్సి ఉండగా మొదటి రోజు నాలుగు జిల్లాల్లో వాహనాల ధరలు మినహా' ఎలక్ట్రానిక్, నిత్యావసర సరకుల అమ్మకాలు పాత ధరలతోనే కొనసాగాయి. ప్రస్తుత నిల్వలకు పాత శ్లాబులే వర్తిస్తాయని, కొత్తవి వచ్చాక ధరలు తగ్గుతాయంటూ పలు చోట్ల బడా వ్యాపారులు జీఎస్టీ విషయంలో దాటవేత ధోరణి అవలంబించారు.

**ఇదీ పరిస్థితి**

పెద్ద దుకాణాల్లో కొందరు మాత్రమే మార్పులతో కూడిన జీఎస్టీ, సీఎస్టీ వివరాలతో బిల్లులు ఇవ్వడం కనిపించింది.

కొందరు పెద్ద వ్యాపారులు ఇంకా నిర్ణయం తీసుకోకుండా అమ్మకాల్లో దాటవేత ధోరణి చూపించారు. టీవీలపై శ్లాబు 28 నుంచి 18 శాతానికి తగ్గనుండటంతో వినియోగదారులు వేచి చూడాలని భావించారు.

చాలా మంది వస్త్ర వ్యాపారులు బిల్లుల్లో జీఎస్టీ లేకుండానే వ్యాపారాలు సాగిస్తుండటం గమనార్హం.

చిన్న దుకాణాలు, వ్యాపారులు ధరల విషయంలో ఎలాంటి తగ్గింపు లేకుండానే వస్తువులు విక్రయించారు.

కొత్త స్టాక్ వచ్చిన తరువాత మార్పులు కనిపిస్తాయని పలు చోట్ల వ్యాపారులు బాహాటంగానే చెబుతున్నారు.

**ప్రతి నెలా రూ.10 కోట్ల మేర లబ్ధి**

శ్లాబుల తగ్గింపుతో వినియోగదారులకు మేలు జరగనుండగా జీఎస్టీ పరిధిలోకి రాకుండా వ్యాపారాలు సాగించే వారి విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలి. ఇప్పటికీ చాలా మంది రూ.20 లక్షలకు పైగా లావాదేవీలను జరుపుతున్నా, జీఎస్టీ పరిధిలోకి రావడం లేదు. దీంతో వినియోగదారుకు ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం రాకుండా పోతోంది. 2017 జులై 1న జీఎస్టీ అమలులోకి వచ్చే నాటికి ఉమ్మడి జిల్లాలో 16,020 మంది డీలర్లున్నారు. వీరంతా ప్రొవిజినల్ ఐడీలు ముందుగా పొంది తర్వాత జీఎస్టీ సంఖ్య అందుకున్నారు. కాలక్రమేణా జీఎస్టీ పరిధిలోని వ్యాపారుల సంఖ్య పెరిగింది. ఏటా రూ.20 లక్షలకు పైగా ఆదాయమున్న వారంతా విధిగా తీసుకోవాల్సి ఉండటంతో మొత్తంగా 21 వేల మంది జీఎస్టీ సంఖ్య పొందారు. అయితే ప్రభుత్వం నుంచి మరిన్ని మార్గదర్శకాలు వచ్చాకనే వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశముంది. ఈ విషయమై వచ్చే నెలలోనే పూర్తి స్థాయిలో స్పష్టత రానుంది. కాగా జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో నెలకు ఎంతలేదన్నా రూ.10-15 కోట్ల వరకు ఉమ్మడి జిల్లాలో వినియోగదారులకు ప్రయోజనం కలిగే అవకాశముందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

**వాహన షోరూంలకు కళ** దసరా సందర్భంగా వాహనాల షోరూంలు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కొనుగోలు చేయాలనుకున్న వారు పది రోజుల ముందు నుంచే బుకింగ్ చేసుకుంటారు. ఈసారి జీఎస్టీని తగ్గించడంతో వాహనం అందుబాటులో ఉన్నా తీసుకోలేదు. కరీంనగర్‌లోని ఓ షోరూంలో సోమవారం ఒకే రోజు 24 కార్లను వినియోగదారులు తీసుకెళ్లడం పరిస్థితికి అద్దం పడుతోంది. జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఖరీదైన వాహనాలపై భారీగానే కనిపిస్తోంది. ద్విచక్రవాహన ధరలు రూ.6 వేల నుంచి, కార్ల ధరలు రూ.40 వేల నుంచి రూ.1.40 లక్షల వరకు తగ్గాయి.

# వేతన వెతలు



ధర్మపురి : పల్లెల్లో పారిశుద్ధ్య కార్మికులను సమస్యలు వెంటాడుతున్నాయి. వీరికి ప్రభుత్వం నెల నెలా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో కార్మికులకు మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు అందాల్సి ఉంది. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో అయినా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

**అనారోగ్యంబారిన..**గ్రామ పంచాయతీల్లో పని చేసే కార్మికులకు గ్లౌజులు, బూట్లు, మాస్కులు, సబ్బులు నెలనెలా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం అందించడం లేదు. దీంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారు.

**51 జీవోపై ఆందోళన**

జిల్లాలో 385 గ్రామ పంచాయతీల్లో 1,478 మంది పంచాయతీ కార్మికులున్నారు. నెలకు చెల్లించాల్సిన రూ.9,500 వేతనం ప్రతీ నెలా అందకపోవడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు సంబంధించి 51 జీవో విడుదల చేసింది. దీని ప్రకారం మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించింది. కారోబార్‌తోసహా ప్రతీ కార్మికుడు పంచాయతీలో అన్ని పనులు చేయాలి. కార్మికుడు ఒక్కోసారి ట్రాక్టర్ నడపాల్సి వస్తోంది. అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. మంచినీళ్ల మోటార్లను నడపడం, విద్యుత్తు బల్బులు పెట్టాల్సి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జీవోను రద్దు చేసి కేటగిరీలవారీగా వర్గీకరణ చేయాలని కార్మికులు కొద్ది సంవత్సరాలుగా నిరసన తెలుపుతున్నారు.

**నేరుగా ఖాతాల్లో జమ- మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి**

రెండు నుంచి మూడు నెలల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాక నేరుగా ఖాతాల్లో జమవుతాయి. అదనంగా ఉన్న కార్మికులను తగ్గించాలని చెబుతున్నాం.

# ప్రయాణం.. జర పైలం



కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలోని రహదారులు అధ్వానంగా మారి.. ప్రయాణికుల ప్రాణాలు పోతున్నా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, రోడ్డుకిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించడంలేదని మండిపడుతున్నారు.

**రైల్వే వంతెనపై పట్టింపేది?**

పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని రైల్వే వంతెన ప్రమాదకరంగా మారింది. సుమారు అర కిలోమీటరు పొడవున్న రైల్వే వంతెన 'యూ' ఆకారంతో ఉంది. వంతెనపైనున్న మలుపులు ఎదురుగా వచ్చే వాహనాలకు కనిపించకుండా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు, సిగ్నల్ వ్యవస్థ, ఇతర రక్షణ గీతలను ఏర్పాటు చేయకపోవడంతో.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**డివైడర్లు కరవై.. ప్రమాదాలకు నెలవై**

పట్టణ పరిధిలోని వెంకట్రావుపేట నుంచి ఆరపేట వరకు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుచోట్ల మలుపులు, గుంతలతో ఆందోళనకరంగా ఉంది. వెంకట్రావుపేట, ఆరపేట శివారుల్లో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. డివైడర్లు నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణం నుంచి వెల్లుల్ల వరకు ఉన్న రహదారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**మేడిపల్లి శివారు జాతీయ రహదారి..**

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి మేడిపల్లి శివారులోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపైనున్న మలుపు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలకు కనిపించకపోవడంతో అదుపు తప్పుతున్నాయి.

**'ఎస్' ఆకారం రోడ్డుతో..**

సిరికొండ-ఏఖీన్‌పూర్ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ వద్దనున్న ఎస్ ఆకారంలోని రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. 'ఎస్' ఆకారంలో మలుపులతో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**నేటికి పదిమంది..** మల్లాపూర్ శివారులోని 61వ జాతీయ రహదారి పరిధిలోనున్న రోడ్డును బాగు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కొన్నేళ్లుగా ఈ మలుపు రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో పది మంది మృత్యువాతపడగా.. అనేక మంది గాయాలపాలయ్యారు. ఈ రోడ్డును సరిచేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

# బడిలో.. విలువల పాఠం

రాజపేట: ఇంటర్ కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఉన్నత విద్యాశాఖ పరంగా ఇప్పటికే పలు విధానాలు అవలంబిస్తుంది. తాజాగా ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు విలువలతో కూడిన విద్యపై అవగాహన కల్పించేందుకు టీ-శాట్ ఛానల్ ద్వారా ప్రసారాలు చేపట్టింది. వచ్చే డిసెంబరు వరకు కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గత ప్రాథమిక, మధ్యాహ్నం 2.30 గంటలకు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విలువల విద్య మొదటిరోజు కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా టీశాట్ వేదికగా ప్రారంభించారు.

**వారంలో ఒకరోజు ప్రసారం..**

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు, నిజాయతీ పెంచేందుకు టీశాట్ వేదికగా వారంలో ఒకరోజు ప్రధానంగా 45 నిమిషాల పాటు ప్రసారం ఉంటుంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు 1.10 నుంచి 1.50 గంటల వరకు, ఉన్నత తరగతుల వారికి మధ్యాహ్నం 2.55 నుంచి 3.35 గంటల వరకు ప్రసారాలు ఉంటాయి.

**షెడ్యూలు వివరాలు:** మొదటి ప్రసారం ఈ నెల 18న జరగగా, తదుపరి అక్టోబరు 9, 16, 23, 30, నవంబరు 6, 20, 27, డిసెంబరు 4, 11, 18, 29 వరకు టీ-శాట్ ద్వారా ఈ విలువల విద్య ప్రసారాలు ఉంటాయి.

**జిల్లా సమాచారం..**

మొత్తం పాఠశాలలు : 679
విద్యార్థుల సంఖ్య : 55,641



18 రకాల అంశాలతో కరదీపికలు..

టీ-శాట్ 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం పాఠ్య ప్రణాళికలు రూపొందించింది. పాఠశాల స్థాయిలో 18 రకాల ప్రధాన విలువలపై అవగాహన కల్పించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు సంకల్పమే విజయానికి కీలకం, జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవడం, నిజాయతీ, కృతజ్ఞత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం, భాగస్వామ్యం, సంరక్షణ, క్రమశిక్షణ, విలువలు, ఓపిక, కరుణ, తోటిపిల్లలతో ప్రవర్తన తదితర అంశాలు బోధనలో ఉంటాయి. ఉన్నత తరగతుల వారికి సంతోష రహస్యం, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవనశైలి, ఒత్తిడి నిర్వహణ-సమస్య పరిష్కారం, ఆలోచన, సంఘశక్తి, బాధ్యత, జీవితం విలువైనది తదితర అంశాలుంటాయి. **విద్యార్థులకు ఉపయుక్తంగా: చందా రమేశ్, ఎంఈవో, రాజపేట**టీ-శాట్ ద్వారా ప్రసారమయ్యే అంశాలు విద్యార్థులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో పరివర్తన వచ్చే అవకాశం ఉంటుంది. పద్దెనిమిది రకాల అంశాలతో కూడిన కరదీపికలను చదువుకోవడంతోపాటు ప్రసారాల వీక్షణంతో విద్యార్థుల్లో మానవత్వం, తోటి వారిపట్ల గౌరవం ఏర్పడుతుంది.

# 'క్లస్టర్ల' వారీగా కష్టాలు..!

కొత్తగూడెం: ఇల్లెందు మండలం కొమురారం క్లస్టర్ పరిధిలో 10,500మంది రైతులు 29,352 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. సాధారణంగా 5వేల ఎకరాల సాగుభూమికి ఒక వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) విధులు నిర్వర్తించాలి. నిబంధనల ప్రకారం ఈ క్లస్టర్ పరిధిలో ఆరుగురు ఏఈఓలు ఉండాలి. కానీ ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. కొన్నాళ్లుగా యూరియా కోసం 2-3వేల మంది అన్నదాతలు రైతువేదికకు వస్తున్నారు. వారికి సరిపడా యూరియా ఇవ్వటం కత్తిమీద సాములా మారుతోందని ఏఈఓ వాపోతున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించి వ్యవసాయ విస్తరణాధికారులను నియమించింది. భద్రాద్రి జిల్లాలో 67 క్లస్టర్లకు 67మంది ఏఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. సాగును లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అన్నదాతలకు చేరవేయటంలో ఏఈఓలదే కీలకపాత్ర. అయితే జిల్లాలో పంటల సాగు విస్తీర్ణానికి సరిపడా క్లస్టర్లు లేకపోవటంతో అన్నదాతలు, ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కొందరిపైనే భారం**

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో భద్రాద్రి జిల్లాలో సుమారు 6.03లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈలెక్కన ఒక్కో క్లస్టర్ పరిధిలో సగటున 9వేల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. సాధారణంగా 5వేల ఎకరాలకే ఒక క్లస్టర్ ఉండాలి. కొన్ని క్లస్టర్ల పరిధిలో 20వేల ఎకరాలకు పైగా



సాగుభూములు దర్శనమిస్తుండటం గమనార్హం. మరికొన్నింటిలో 1,000 ఎకరాల్లోపు భూములు ఉన్నాయి. అధిక విస్తీర్ణం కలిగిన క్లస్టర్ల పరిధిలో విధులు నిర్వర్తించే ఏఈఓలపై భారం పడుతోంది.

**రెవెన్యూ భూమి ప్రామాణికం**

ఖమ్మం జిల్లాలో 129 క్లస్టర్లు ఉండగా.. భద్రాద్రి జిల్లాలో 67 మాత్రమే ఏర్పాటుచేశారు. క్లస్టర్ల ఏర్పాటులో అధికారులు రెవెన్యూ భూమిని ప్రామాణికంగా తీసుకోవటమే ఈ వ్యత్యాసానికి కారణం. ప్రతి 5వేల ఎకరాల సాగుభూమికి ఒక క్లస్టర్, దాని పరిధిలో ఒక రైతువేదిక నిర్మించారు. భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ భూమి కంటే ఆర్ఓఎఫ్ఆర్, పోడు భూములు ఎక్కువగా ఉండటంతో క్లస్టర్ల సంఖ్య తగ్గింది. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలివ్వటం, వాటికి పథకాలు వర్తింపజేయటంతో సాగు విస్తీర్ణం ఎక్కువైంది.

**మంత్రి దృష్టి సారిస్తేనే..**

భద్రాద్రి జిల్లాలోని సాగుభూమికి అనుగుణంగా క్లస్టర్ల సంఖ్య పెంచాలని ఏఈఓలు కోరుతున్నారు. ఆర్ఓఎఫ్ఆర్, పోడు పట్టాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధిక సాగు విస్తీర్ణం కలిగిన క్లస్టర్ల పరిధిలో పనిభారంతో సతమతమవుతున్నామని చెబుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని కొత్తగా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.




# భారత అమ్ములపొదిలో మరో అస్త్రం..!

భారత్ ఆయుధ శక్తి మరో కీలక ముందడుగు వేసింది. తొలిసారి రైలు పైనుంచి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించే సామర్థ్యాన్ని పరీక్షించింది. ఈవిషయాన్ని డీఆర్డీవో, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. అణుసామర్థ్యం ఉన్న అగ్ని ప్రైమ్ క్షిపణిని దీని పైనుంచి ప్రయోగించినట్లు రాజ్‌నాథ్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.

ఆయన రక్షణ పరిశోధనాభివద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ను అభినందించారు. అతిత క్కువ సమయంలో అవసరమైన చోటుకు తరలించి ప్రయోగించేలా రైలు ఆధారిత మొబైల్ లాంఛింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు వెల్లడిం చారు.

"ప్రత్యేకంగా డిజైన్ చేసిన రైల్ బేస్డ్ మొబైల్ లాంఛర్ నుంచి తొలిసారి క్షిపణి ప్రయోగం చేపట్టాం. రైల్ నెట్‌వర్క్ సాయంతో ఎటు వంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండా దేశంలో ఎక్కడికైనా వేగంగా తరలించి.. తక్కువ రియాక్షన్ టైమ్‌లో శత్రువు కంటపడకుండా ప్రయోగించవచ్చు" అని పేర్కొన్నారు. ఇక అగ్నిప్రైమ్ మిసైల్‌లో చాలా అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. ఇది భారత రక్షణకు అదనపు బలాన్ని చేకూరుస్తుంది. దీనిలో రింగ్ లేజర్ గైరో ఆధారిత ఇనర్షల్ నేవిగేషన్, మైక్రో ఇనర్షల్ నేవిగేషన్ సిస్టమ్‌లను అమర్చారు. దీంతోపాటు జీపీఎస్, నావిక్ శాటిలైట్ నేవిగేషన్లకు కూడా దీన్ని వాడుకొనే ఆప్షన్ ఉంది. ఇక ఈ మిసైల్‌కు ఉన్న కెనిస్టర్ డిజైన్ కారణంగా తేలిగ్గా ఎక్కడికైనా రవాణా చేసి భద్రపర్చవచ్చు. ఇది లాంఛింగ్‌కు అవసరమైన సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే అగ్ని-పి క్షిపణి పలు టెస్టుల్లో సామర్థ్యాన్ని నిరూపించుకొంది.


# నా జీవితకాల గురువు సీఎం చంద్రబాబు: మంత్రి నారా లోకేశ్



అమరావతి: దేశానికి అధినేత అయినా గురువు వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిందేనని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎం చంద్రబాబు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. " నాకు జీవితకాల గురువు సీఎం చంద్రబాబు. పదో తరగతి వరకు నేను నామమాత్రంగా చదివేవాడిని. ఫండమెంటల్స్‌లో చురుగ్గా లేనని నారాయణ పాఠాలు చెప్పారు. అమెరికా వెళ్లినప్పుడు ప్రొ.రాజిరెడ్డి.. విద్యావ్యవస్థ గురించి చెప్పారు. వీళ్ల వల్లే ఇవాళ నేను మీ ముందు నిల్చున్నా. యువగళం పాదయాత్రలో నిరుద్యోగ యువతను కలిశా. అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అని చెప్పా. సీబీఎన్ అంటే డీఎస్సీ.. డీఎస్సీ అంటే సీబీఎన్"


**ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిద్దాం..** "ఉమ్మడి ఏపీలో 15 డీఎస్సీలు జరిగితే తెదేపా హయాంలోనే 14 డీఎస్సీలు నిర్వహించాం. తెలుగుదేశం హయాంలో 2లక్షల మంది టీచర్లను నియమించాం. సమష్టి కృషి వల్లే మెగా డీఎస్సీ మెగా హిట్ అయ్యింది. 150 రోజుల్లో 150 కేసులు వేసినా నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాం. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా పెట్టాం. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని సీఎం చెప్పారు. నవంబర్‌లో మరోసారి టెట్ నిర్వహిస్తున్నాం. వచ్చే ఏడాది మళ్లీ డీఎస్సీ నిర్వహిస్తాం. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిద్దాం. ఫిన్లాండ్, సింగపూర్‌లో విద్యా వ్యవస్థపై అధ్యయనం చేయాల్సి ఉంది" అని లోకేశ్ అన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మెగా డీఎస్సీ విజేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# రాజకీయ ముసుగులో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు: హోం మంత్రి అనిత



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు 60 శాతం తగ్గాయని జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని హోం మంత్రి అనిత అన్నారు. గతంలో స్కూల్ పిల్లలకు గంజాయి పంపిణీ చేసే దుస్థితి ఉండేదని, సీఎం చంద్రబాబు కఠినంగా వ్యవహరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందని తెలిపారు. శాసనసభలో ఆమె మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యం ధరలకు భయపడి చాలా మంది గంజాయి వైపు మళ్లారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈగల్ విభాగం ద్వారా గంజాయిని కట్టడి చేశామని, 40 వేలకు పైగా ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళా భద్రతకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. " ప్రత్యేకంగా 'శక్తి' పేరుతో మొబైల్ యాప్ అందుబాటులోకి తెచ్చాం. వైకాపా హయాంలో శాంతిభద్రతలు లేవు. నాతో సహా అందరూ తప్పుడు కేసులతో ఇబ్బందిపడ్డారు. అమరావతిలోని ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణం ఆపివేశారు. మేం వచ్చేసరికి 25 వేల ఫోరెన్సిక్ నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని 1600 తగ్గించాం. పోలీసులకు కావాల్సిన పరికరాలు, ఉపకరణాలు అందించకుండా నిర్లక్ష్యం వహించారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా న్యాయవ్యవస్థను పటిష్ఠం చేశాం. నేరం జరిగిన వెంటనే ఘటనాస్థలికి వెళ్లడం ద్వారా ఆధారాలు సేకరించడం, శిక్షలు వేయడం సులువని సీఎం చెప్పారు. రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు.. సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా క్రిమినల్ వ్యవస్థను తయారుచేసి మన పైకి వదిలారు. సోషల్ మీడియా ద్వారా సీఎం, డిప్యూటీ సీఎంపై విద్వేష ప్రచారం చేశారు. జగన్ అండతో చాలామంది కులం పేర్లు మార్చుకుని విద్వేష పోస్టులు పెడుతున్నారు. మనతో పాటు మన కుటుంబ సభ్యులను ఇష్టారాజ్యంగా తిట్టిస్తున్నారు. పవన్ కల్యాణ్ కుమార్తె పైనా అసభ్యంగా మాట్లాడారు. ఇలాంటి వాటిని నియంత్రించేలా చట్టాల్లో మార్పులు తేవాలి. సోషల్ మీడియా నేరాలు, ఆర్థిక నేరాలు కూడా పెరిగిన నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం వేశాం. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని అనిత తెలిపారు.

# ఏపీఈఆర్సీ నిబంధనల మేరకే విద్యుత్ పరికరాల కొనుగోలు: మంత్రి గొట్టిపాటి



అమరావతి: డిస్కంల పరిధిలో విద్యుత్ పరికరాల కొనుగోలు ఏపీ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో బిడ్డింగ్ ద్వారా జరుగుతుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏపీఈఆర్సీ నిబంధనల మేరకు మాత్రమే విద్యుత్ పరికరాల కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పరికరాల కొనుగోలు, కాస్ట్ డేటాపై శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖరం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రూ.5 కోట్లకు మించి ధర ఉండే ప్రతి పరికరాన్ని ఏపీఈఆర్సీ అనుమతి తీసుకునే కొనుగోలు చేస్తున్నామని వివరించారు. మూడు డిస్కంల పరిధిలో విద్యుత్ స్తంభాలు, టవర్ల కొనుగోలు ధరల వ్యత్యాసంలో తేడా స్వల్పంగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే.. పరికరాల నాణ్యత కారణంగానే ధరల వ్యత్యాసం కొంచెం ఎక్కువగా ఉందన్నారు. సింగిల్, డబుల్ స్టార్ ట్రాన్స్‌ఫార్మర్లలో నాణ్యతా లోపంతో పాటు సామర్థ్యం తక్కువ ఉంటుందని చెప్పారు. ఎనర్జీ ఎఫిషియన్సీ లోపం కారణంగా విద్యుత్ ఖర్చు పెరిగి డిస్కంల మీద భారం పడుతోందని వివరించారు. దీనిని అరికట్టేందుకు వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు 5 స్టార్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉపయోగిస్తున్నామని వెల్లడించారు. జగనన్న కాలనీల కోసం రూ.220 కోట్లకు సామగ్రి కొనుగోలు చేశారని.. నిరుపయోగంగా ఉన్న వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

# ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో అదనపు భవన సముదాయం ప్రారంభం



అమరావతి: గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో అదనపు భవన సముదాయాన్ని మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. మీడియా పాయింట్ పైఅంతస్తులో అదనపు భవన సముదాయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో దాదాపు 14వేల చదరపు అడుగుల వర్క్‌స్పేస్ అందుబాటులోకి వచ్చింది. భవన సముదాయం పూర్తి చేసేందుకు పయ్యావుల కేశవ్, నారాయణ ఎంతో కృషి చేశారని స్పీకర్ ప్రశంసించారు. రూ.5కోట్ల అంచనా వ్యయం అనుకుంటే రూ.3 కోట్లతోనే పూర్తిచేసినట్లు తెలిపారు. విప్‌లు, మీడియా కోసం మొత్తం 16 ఛాంబర్లు, డైనింగ్ అందుబాటులోకి వచ్చాయని నారాయణ చెప్పారు. అసెంబ్లీ శాశ్వత భవన నిర్మాణంలో స్పీకర్ సలహాలు తీసుకుంటున్నామన్నారు. అనవసర ఖర్చు తగ్గిస్తూ ప్రజలకు ఏది అవసరమో ప్రభుత్వం అదే చేస్తోందని పయ్యావుల కేశవ్ తెలిపారు.




అమరావతి: సూపర్ సిక్స్‌పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఏపీ శాసన మండలిలో తీవ్ర గందరగోళం నెలకొంది. హామీలు అమలు చేయకుండానే సూపర్ హిట్ అంటూ కూటమి సర్కారు మోసగిస్తోందని వైకాపా సభ్యుడు రమేశ్ యాదవ్ ఆరోపించగా మంత్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. హామీల అమలును జీర్ణించుకోలేకే వైకాపా నేతలు కడుపుమంటతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబును కుప్పం ఎమ్మెల్యే అంటూ సంబోధించిన వైకాపా ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా సభ్యుడు సీఎంను కుప్పం ఎమ్మెల్యే అని మాట్లాడారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రికార్డులను పరిశీలించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంను అగౌరవపరిచినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం సభా నాయకుడు.. ఆ విషయాన్ని వైకాపా సభ్యుడు ఎలా మర్చిపోతారని మంత్రి నాదెండ్ల మనోహర్ నిలదీశారు.

**రమేశ్ యాదవ్ మాటలు అభ్యంతరకరం: మండలి ఛైర్మన్..** సభలో పరిణామాలు సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని మండలి ఛైర్మన్ మోషేనురాజు అన్నారు. జరిగిన పరిణామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. సభ్యుడు రమేశ్ యాదవ్ మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు. పెద్దల సభలో సభ్యులు హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌పై లఘు చర్చను రేపటికి వాయిదా వేశారు. రేపు వ్యవసాయంతో పాటు సూపర్ సిక్స్ అంశాలు చర్చించాలని నిర్ణయించారు.




## తిరుమలలో అత్యాధునిక వసతి సముదాయం పీఏసీ-5ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి, సీఎం

తిరుమల: తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మరో అత్యాధునిక వసతి సముదాయం ప్రారంభమైంది. వేంకటాద్రి నిలయం యాత్రికుల వసతి సముదాయం (పీఏసీ5)ను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ముందస్తు బుకింగ్ లేకున్నా భక్తులకు వసతి కల్పించేలా రూ.102 కోట్లతో నూతన కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఇందులో ఒకేసారి 4 వేల మందికి ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నారు. 16 డార్మిటరీలు, 2,400 లాకర్లు, 24 గంటలూ వేడి నీటి సదుపాయం ఇందులో ఉన్నాయి.

ల పీఏసీ-5 ప్రాంగణంలో ఒకేసారి 80 మంది తలనీలాల సమర్పణకు వీలుగా కల్యాణకట్ట ఏర్పాటు చేశారు. ఒకేసారి 1400 మంది భోజనానికి వీలుగా రెండు డైనింగ్ హాళ్లు ఉన్నాయి. వసతి గృహం బుకింగ్ కౌంటర్‌ను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి సీఎం పరిశీలించారు. నూతన వసతిగృహంలో తొలి బుకింగ్ టోకెన్‌ను భక్తులకు అందించారు. కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.




అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల చెల్లింపు అంశాలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును సైతం వైకాపా ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు ఉద్యోగుల విషయంలో దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత వైకాపా ప్రభుత్వం మోసం చేసింది. ఎన్నికల వాగ్దానాలను గుర్తుపెట్టుకుని అమలు చేసి ఉంటే ఆ పార్టీకి ఈ దుస్థితి వచ్చేది కాదు. గత సర్కారు హయాంలో 94 కేంద్ర ప్రభుత్వ పథకాల సొమ్మును ఇతరాలకు వాడేశారు. గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చింది. ఐఆర్ కంటే తక్కువగా 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేసింది. కరోనా పేరు చెబుతూ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌ను తగ్గించింది. ఇదే వంకతో చెప్పి కేంద్రం నుంచి రావాల్సిన దానికంటే ఎక్కువ నిధులు తీసుకుంది. రెండేళ్లుగా రావాల్సిన రెవెన్యూ లోటు మొత్తాన్ని ముందే తీసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంది. గతంలో తెలంగాణ కంటే ఒకశాతం ఎక్కువ అంటే.. 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ప్రభుత్వం మాదే. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాం. 2024-25 మధ్యలో ఉద్యోగులకు సంబంధించి రూ.11,496 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. 2025-26లో రూ.3,549 కోట్లను చెల్లించాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో, వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. సరైన సమయంలో సీఎం చంద్రబాబు దీనిపై చర్యలు తీసుకుంటారు" అని పయ్యావుల కేశవ్ తెలిపారు.

# వైకాపా ఇంకా హింసను ప్రోత్సహిస్తూనే ఉంది: యరపతినేని




అమరావతి: వైకాపా హయాంలో రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగిందని తెదేపా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో తెదేపా కార్యకర్తలు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి కల్పించారన్నారు. సీఎం చంద్రబాబు పాలనతో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పారు. శాంతిభద్రతలపై శాసనసభలో జరిగిన లఘుచర్చలో యరపతినేని మాట్లాడారు. "వైకాపా పాలనలో తెదేపా ముఖ్యనేతలు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సోమిరెడ్డి వంటివారిపై అక్రమ కేసులు పెట్టారు. తెదేపా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించారు. 2019-24 మధ్య రాష్ట్రంలో దాదాపు 80 మంది కార్యకర్తలు హత్యకు గురవగా.. 250 మంది గాయపడ్డారు. వందలాది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. వైకాపా నాయకత్వం హింసను ఇంకా ప్రోత్సహిస్తూనే ఉంది. సీఎంగా పనిచేసిన జగన్.. కత్తితో నరికితే తప్పేంటని అంటున్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎవరిని నరుకుతారో పేర్లు ఇవ్వండి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సీఐ శంకరయ్య తీరు ఆక్షేపణీయం. ముఖ్యమంత్రికి ఆయన నోటీసులు ఇస్తారా? గురజాలలో వైకాపా నేతలు చేసిన అక్రమ మైనింగ్ గుంతల్లో పడి 11 మంది పిల్లలు చనిపోయారు" అని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.




వైకాపా నేత జగన్.. ప్రజల పట్ల బాధ్యత లేకుండా వ్యవహ రిస్తూ ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపై చర్చ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. వైకాపా నేతలు ఇటీవల చేస్తున్న 'రప్పా రప్పా' డైలాగులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్టీఆర్ హయాం నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని.. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని స్పీకర్ అన్నారు. వైకాపా సభ్యులు సభకు రాకుండానే ప్రశ్నలు పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో గౌతు లచ్చన్న పార్టీ తరఫున 64 మంది ఎన్నికైతే ప్రతిపక్ష హోదా ఇచ్చారని.. అయితే సభ్యులు కొందరు పార్టీ మారిన నేపథ్యంలో ఆయన ప్రతిపక్ష హోదాను స్వయంగా వదులుకున్నారని గుర్తు చేశారు. జగన్ మాత్రం సంఖ్యాబలం లేకున్నా ప్రతిపక్ష హోదా అడగటమేంటని ప్రశ్నించారు.

## మినీ ఫ్రాక్ లో మనసు దోచుకుంటున్న స్నేహా ఉల్లాల్.. ఫోటోలు వైరల్!

కొంతమంది హీరోయిన్ల అదృష్టం ఓవర్ నైట్ లోనే దశ తిరుగుతుంది అంటుంటారు. అలాంటి వారిలో ఈ హీరోయిన్ కూడా ఒకరు.. మాజీ విశ్వసుందరి, ప్రముఖ స్టార్ హీరోయిన్ ఐశ్వర్య రాయ్ పోలికలతో ఉన్న ఈ హీరోయిన్ బాలీవుడ్ సినిమాలతో సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది.ఆ తర్వాత హిందీ, తెలుగు, తమిళ భాషల్లో హీరోయిన్ గా రాణించింది. ఆమె ఎవరో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. ఆ హీరోయిన్ ఎవరో.. ఆమె ఎవరో కాదు స్నేహ ఉల్లాల్.. ఐశ్వర్యరాయ్ పోలికలతో ఉన్న స్నేహా ఉల్లాల్ ని సల్మాన్ ఖాన్..'లక్కీ నో టైమ్ ఫర్ లవ్' అనే సినిమాతో పరిచయం చేశారు. అయితే ఈ విషయం తెలిసిన చాలామంది గతంలో సల్మాన్ ఖాన్,ఐశ్వర్యరాయ్ మధ్య బ్రేకప్ అయ్యాక.. సల్మాన్ ఖాన్ ఐశ్వర్య రాయ్ మీద ఉన్న కోపంతోనే ఆమె లాంటి పోలికలు ఉన్న నటి స్నేహ ఉల్లాల్ ని ఇండస్ట్రీకి పరిచయం చేశారు అంటుంటారు. అలా ఫైనల్ గా స్నేహ ఉల్లాల్.. సల్మాన్ సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత కొన్ని హిందీ సినిమాల్లో నటించి 'ఉల్లాసంగా ఉత్సాహంగా' అనే సినిమాతో టాలీవుడ్లోకి ఎంట్రీ



ఇచ్చింది. సింహ, మడత కాజా,నేను మీకు తెలుసా వంటి సినిమాల్లో చేసింది. కానీ ఈమె తెలుగులో చేసిన ఉల్లాసంగా ఉత్సాహంగా సినిమా తప్ప.. మిగతా ఏ సినిమాల్లో కూడా ఈ హీరోయిన్ కి గుర్తింపు రాలేదు. అలా చివరికి తెలుగులో కొన్ని సినిమాల్లో రాణించి మళ్లీ బాలీవుడ్ ఇండస్ట్రీకి వెళ్ళిపోయింది.అలా ఈ ఏడాది స్నేహ ఉల్లాల్ 'సాకో 363' మూవీలో నటించింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ హీరోయిన్ తన హాట్ అందాలతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. బ్లాక్ కలర్ బికినీ తో పాటు ఎల్లో కలర్ మినీ ఫ్రాక్ లో చాలా హాట్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోస్ ఇన్స్టాగ్రామ్ లో వైరల్ అవ్వడంతో ఫాలోవర్స్ ఈమె అందానికి మెంటలెక్కిపోతున్నారు. అంటూ కామెంట్స్ పెడుతున్నారు నెటిజన్స్.. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా "టేక్ మీ బ్యాక్" అనే క్యాప్షన్ కూడా పెట్టింది.. ఇక స్నేహ ఉల్లాల్ బికినీ లుక్ చూసిన కొంతమంది నెటిజన్స్ అయితే ఈ ముద్దుగుమ్మ మళ్లీ అవకాశాలు అందుకోవాలని.. ఎప్పటిలాగే అభిమానులను అలరించాలి అని కోరుతున్నారు. మరి ఈ హీరోయిన్ అందాల ఆరబోతతో నైనా అవకాశాలు వస్తాయేమో చూడాలి. ఇక స్నేహ ఉల్లాల్ నుండి నెక్స్ట్ రాబోయే సినిమాల విషయానికి వస్తే.. కన్నడలో ఈ హీరోయిన్ నటించిన దేవి మూవీ ఈ ఏడాది డిసెంబర్ లో విడుదలకు రెడీగా ఉంది. అలాగే స్నేహ ఉల్లాల్ నటిస్తున్న తమిళ మూవీ ఏస్ రాజా రాణి జాకీ మరియు జోకర్ అనే మూవీ 2027 లో విడుదల కాబోతుంది.

## ఆ బ్యూటీ కోరిక క్యాట్ తో ఫైటింగ్!


ఒకప్పుడు హీరోయిన్ అంటే గ్లామర్ కే పరిమితం. నాలుగు పాటలు..రొమాంటిక్ సన్నివేశాలతోనే హీరోయిన్ పాత్ర హైలైట్ అయ్యేది. కానీ ఇప్పుడా సన్నివేశానికి భిన్నంగా హీరోయిన్ పాత్రలు తెరపై హైలైట్ అవుతున్నాయి. నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో కనిపిస్తున్నారు. పాత్రల పరంగా సెలక్టివ్ గా ఉంటున్నారు. మనసుకు నచ్చితే తప్ప కమిట్ అవ్వడం లేదు. అవసరమైతే వచ్చిన అవకాశాన్ని వదులకోవడానికైనా సిద్దంగా ఉంటున్నారు గానీ పాత్ర పరంగా రాజీకి మాత్రం రావడం లేదు. కొంత కాలం క్రితం ఫలానా పాత్రలో నటించాలని ఉందని బయటకు చెప్పడానికి ఆలోచించేవారు. కానీ ఇప్పుడా పరిస్థితులు లేవు. మనసుకు నచ్చిన పాత్రపై ముందే ఓపెన్ అవుతున్నారు. మేకర్స్ కూడా ఆరకంగా సిద్దమై పేరున్న భామల్ని కథలో భాగం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి వాణీ కపూర్ కూడా హీరోలకు ధీటుగా యాక్షన్ సన్నివేశాల్లో నటించాలని ఉందని ఓపెన్ అయింది. ఇటీవలే అమ్మడు మండాలా మర్డర్స్ సిరీస్ తో అలరించిన సంగతి తెలిసిందే. ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించింది. అదే కాన్ఫిడెన్స్ తో వెండి తెరపై సైతం అలాంటి పాత్రలు



పోషించడానికి తానేప్పుడు సిద్దంగా ఉంటానంది. ఈ సందర్భంగా మాధురి దీక్షిత్, శ్రీదేవి లాంటి నటీమణుల్ని గుర్తు చేసుకుంది. 80-90 కాలంలో వాళ్లిద్దరుపోషించిన పాత్రల గురించి చెప్పుకొచ్చింది. వాళ్ల తరహాలోనే తాను కూడా మెరవాలనుందని ఆశపడింది. పాత్ర బలంగా ఉంటే అది చిన్న రోల్ అయినా నటించడానికి సిద్దంగా ఉంటానంది. మూడు గంటల సినిమాలో ఓ పెద్ద పాత్ర కంటే చిన్న సినిమాలో బలమైన పాత్ర ఒక్కటి పోషించినా నటిగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతామంది. బలమైన యాక్షన్ ప్రధానమైన సినిమాల్లో నటించే అవకాశం వస్తే తానే ముందుంటానంది. ముఖ్యంగా ఇలాంటి సినిమాల్లో తనకు జోడీగా కత్రినాకైఫ్ అయితే ఇంకా బాగుంటుందంది. కత్రినా యాక్షన్ సన్నివేశాలంటే తనకు ఎంతో ఇష్టమంది. అందుకే ఆమె తో తెరను పంచుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేసింది. ప్రస్తుతం వాణీ కపూర్క బాలీవుడ్ లో రెండు సినిమాలు చేస్తోంది. సర్వగుణ సంపన్న, బెడ్ తామిజ్ గిల్ చిత్రాల్లో నటిస్తోంది.




## అభిమానుల కోరిక.. ప్రభాస్ ఏమంటాడో?



కల్కి 2 నుంచి బాలీవుడ్ నటి దీపికా పదుకొణే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. దీంతో అమ్మడు పోషించిన తులసి పాత్రను ఏ నటితో భర్తీ చేస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది. పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాబట్టి ఏ నటిని తీసుకున్నా ఆ రేంజ్ నటినే తీసుకోవాలి. కొత్త వారిని తీసుకునే పరిస్థితి లేదు. అలా చూసుకుంటే బాలీవుడ్ నటీమ ణులే కనిపిస్తున్నారు. కానీ మేకర్స్ మాత్రం ఈసారి వాళ్లకంటే బాగా తెలిసిన వారికే ఛాన్స్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది పూర్తిగా దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది.

**ఎంపిక ఎవరి నిర్ణయం:** ఈ ప్రాజెక్ట్ కి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనే. హీరో..నిర్మాత ముఖ్యమే అయినా ఇద్దరు నాగీని దాటి వెళ్లరు. ఆయన మాట కాదనలేరు. కాబట్టి ఏ హీరోయిన్ ని ఎంపిక చేయాలి? అన్నది అతడి నిర్ణయమే. పైగా ఇలాంటి విషయాల్లో ప్రభాస్ కూడా పెద్దగా కల్పించుకోడు. మేకర్స్ నిర్ణయానికే కట్టుబడి పని చేస్తారు. కానీ ఈ సినిమా హీరోయిన్ విషయంలో మాత్రం డార్లింగ్ చొరవ తీసుకుంటేనే బాగుంటుది? అన్న అభిప్రాయం అభిమానుల నుంచి వ్యక్తమవుతోంది.

**అనుష్క ఓ ఆప్షన్:** ప్రభాస్ కి పర్ఫెక్ట్ జోడీగా అనుష్క శెట్టి మాత్రమే సరితూగుతుందని ఇంకెవ్వరు సాటి రాలేరని..ఈ నేపథ్యంలో ఆమెనే తీసుకుంటే బాగుంటుందని ఫ్యాన్స్ కోరుతున్నారు. సినిమాలో సుమతి పాత్ర కూడా గర్భవతిగా కనిపి స్తుంది. ప్రస్తుతం అనుష్క రూపంలో కొన్ని రకాల మార్పులున్న నేపథ్యంలో సుమతి పాత్రకు పక్కాగా సరిపో తుందంటున్నారు. %-%బాహుబలి%-% సినిమాతో పాన్ ఇండియాలో కూడా ఆమెకు గుర్తింపు ఉండటంతో ఆమెని మించిన నటిని వెతకడం అంటే? సమయం వృదాగానే భావిస్తున్నారు.

**డార్లింగ్ మాట కాదంటరా:** కానీ ఇక్కడ అనుష్క ఎంటర్ అవ్వాలంటే రెండు జరగాలి. ఒకటి నాగీ ఆమె విషయంలో పూర్తి సంతృప్తిగా ఉండి పిలివగలగాలి. అలా కాకపోతే? ప్రభాస్ అనుష్క పేరును సజెస్ట్ చేయాలి. డార్లింగ్ రికమండేషన్ అంటే నాగీ కూడా అంత తేలిగ్గా కొట్టి పారేయలేరు. తాను కూడా పరిశీలనలోకి తీసుకుంటారు. అవసరమైతే లుక్ టెస్టులు చేసి అన్ని రకాలుగా ఫిట్ అనుకుంటే? తీసుకొవొచ్చు. లేదా హోల్డ్ లో పెట్టొచ్చు. ఎవరు సెట్ కాని పరిస్థితుల్లో అనుష్కను మళ్లీ పున:పరిశీలన చేసి తీసుకునే అవకాశం ఉంటుంది.

## 'జాంబిరెడ్డి-2' తేదీ సరే? కెప్టెన్ ఎవరు?



యంగ్ హీరో తేజ సజ్జా ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్నాడు. హనుమాన్ అనంతరం మిరాయ్ తో మరో పాన్ ఇండియా సక్సెస్ ఖాతాలో వేసుకున్నాడు. రెండు సినిమాలు వంద కోట్ల క్లబ్ లో చేరిన చిత్రాలు కావడంతో తేజ పేరు అన్ని చోట్లా హాట్ టాపిక్ మారింది. సరైన స్టోరీలు ఎంచుకో వడంతోనే ఇది సాధ్యమవుతుంది? అన్నది సక్సెస్ రూపంలో కనిపిస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్ గా పనిచేసిన అనుభవం.. సినిమాలపై తనకున్న ప్యాషన్ ప్రతీది కళ్ల ముందు కనిపిస్తుంది. భవిష్యత్ లో ఇంకా పెద్ద స్టార్ అవుతాడని విశ్లేషకులు భావిస్తున్నారు.

**హిట్ సినిమాకు సీక్వెల్:** ఈ నేపథ్యంలో తదుపరి చిత్రాల విషయంలో అంతే ప్లానింగ్ తో ముందుకెళ్తున్నాడు. జాంబిరెడ్డి 2ని ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన జాంబిరెడ్డి భారీ విజయం సాధించడంతో? పార్ట్ 2 కూడా ఉంటుందని అప్పుడే వెల్లడించారు.


కానీ మధ్యలో అనూహ్యంగా కొత్త ప్రాజెక్ట్ లకు కమిట్ అవ్వడం..ముందుగా వాటిని పట్టాలెక్కించడంతో జాంబిరెడ్డి 2 డిలే అవుతుంది. ఈ నేపథ్యంలో తదుపరి తాను తీసేది జాంబిరెడ్డి 2 అని తేజ చెప్పేసాడు. మరి ఈ సినిమాకు దర్శకుడు ఎవరు? అంటే ఇంకా ఫైనల్ కాలేదు.

**రెట్టింపు వినోదంతో:** ప్రశాంత్ వర్మ ఈసారి కేవలం రచన వరకే పరిమితమయ్యాడు. బ్యాకెండ్ వర్క్ చేస్తాడు తప్ప తాను ముందుకొచ్చి డైరెక్ట్ చేయనని చెప్పేసాడు. దీంతో ఇప్పుడా ప్రాజెక్ట్ కి డైరెక్టర్ ని సెట్ చేసే పనిలో ఉందా ద్వయం.ఈసారి జాంబిరెడ్డి 2 రెట్టింపు వినోదం ఉంటుందని తెలిపారు. ఈ కథ కోసం ఓ కొత్త ప్రపంచాన్నే సృష్టించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని కూడా పీపూల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తుంది. జనవరి నుంచి పట్టాలెక్కించాలని నిర్మాణ సంస్థ ప్రణాళిక సిద్దం చేస్తోంది.

**ఆ రేంజ్ లో రిలీజ్:** కానీ దర్శకుడు ఎవరు? అన్నది మాత్రం ఇంత వరకూ క్లారిటీ రాలేదు. అలాగే ఈ చిత్రాన్ని పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తారా? రీజనల్ మార్కెట్ కే పరిమితం చేస్తారా? అన్నది చూడాలి. జాంబిరెడ్డి మాత్రం స్థానికంగా రిలీజ్ అయిన చిత్రమే. కానీ తేజ నేడు పాన్ ఇండియా స్టార్ అయిన నేపథ్యంలో జాంబిరెడ్డి2 రిలీజ్ ఆ రేంజ్ లో ప్లాన్ చేస్తారా? అన్నది చూడాలి. ప్రస్తుతం తేజ మిరాయ్ సక్సెస్ ని ఆస్వాదిస్తున్నాడు. త్వరలోనే విదేశాలకు వెకేషన్ కు వెళ్లను న్నట్లు సమాచారం.

## తమన్నా మరీ ఇంత బోల్డ్ 'గానా'.. లేటెస్ట్ పై కాంట్రవర్సీ

బాలీవుడ్ లో స్పెషల్ సాంగ్స్ ట్రెండ్ మారింది. ఒకప్పుడు హిందీలో స్పెషల్ అంటే సన్ని లియోన్ అనేవారు. ఇప్పుడు మాత్రం సినిమాలో స్పెషల్ అంటే మిల్క్ బ్యూటీ తమన్నాను అప్రోచ్ అవుతున్నారు మేకర్స్. రెండేళ్లుగా బాలీవుడ్ ఒకటే కాదు సౌత్ లోనూ స్పెషల్ సాంగ్ అంటే మిల్క్ బ్యూటీకే ఓటేస్తున్నారు. తమన్నా ఆడిపాడిన పాటలకు సైతం ఆ రేంజ్ లోనే రెస్పాన్స్ వస్తోంది. అయితే తాజాగా ఆమె బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సిరీస్ కోసం గఫూర్ అనే ప్రమోషనల్ సాంగ్ లో ఆడిపాడింది. ఈ పాటకు కూడా మంచి రీచ్ వస్తోంది. ఇందులో తమన్నా లుక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తన లుక్స్ తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ పాట ట్రెండింగ్ లోనూ ఉంది. అయితే స్పెషల్ సాంగ్ అంటేనే ట్రెండీ ఔట్ ఫిట్, హాట్ లుక్స్ అన్న విషయం తెలిసిందే. కానీ ఈ పాటకు తమన్నా ఔట్ ఫిట్ ప్రస్తుతం కాంట్రవర్సీకి దారి తీస్తోంది. ఇందులో ఆమె డ్రెస్సింగ్ కాస్త హద్దు దాటినట్లు ఉందని ఫ్యాన్స్ అంటు



న్నారు. ఆమె నుంచి మరీ ఇలాంటి డ్రెస్సింగ్ సెన్స్ ఊహించలేదని, దీంతో సర్ ప్రైజ్ ఇచ్చారని, ఇది చూసి ఆశ్చర్యపోయినట్లు కామెంట్ చేస్తున్నారు. మరికొందరు ఇలాంటి ఔట్ ఫిట్ ధరించేందుకు డేరింగ్ చేసినందుకు మెచ్చుకుంటున్నారు. జెన్ జీ ట్రెండ్‌లను ప్రయత్నిస్తురని అంటున్నారు. ఈ పాటలో ఆమె కాన్ఫిడెంట్, డ్యాన్స్ స్టెప్పులు అందరి దృష్టిని ఆకర్షించాయి. అయితే ఇది ఈ రోజుల్లో సినిమాల్లో బోల్డ్ ఫ్యాషన్ ఎలా కీలక పోషిస్తుందనే దాని గురించి చర్చలకు దారితీసింది. దీంతో ఇలాంటి బోల్డ్ పాట సినిమాలో అవసరం ఉండి ఆమె చేసిందా... లేదా ఇండస్ట్రీలో తన మనుగడ నిలదొక్కుకునేందుకు చేసిన ప్రయత్నమా అని ఆశ్చర్యపోతున్నారు. అయితే అందరు క్రిటిసైజ్ చేయడం లేదు. కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు కూడా. ఆమె నేచురల్ బ్యూటీనెస్, డేరింగ్ నెస్ , కాన్ఫిడెన్స్, యూనిక్ స్టైల్ పట్ల తమన్నాను మెచ్చుకుంటున్నారు. హీరోయిన్లు తమ స్కిల్స్ చూపించేందుకు ఎంత దూరం వెళ్లగలరో ఈ పాట చూపించింది. ఈ సింపుల్ ప్రమోషనల్ సాంగ్ ప్రస్తుతం సినిమా ట్రెండ్స్ ను మార్చేసింది. దీంతోపాటు గతంలో తమన్నా జైలర్ లో కావాలయ్య , హిందీ సినిమా స్త్రీ 2లో ఆజ్ కి రాత్, అచావ్ అనే పాటల్లో ఆడిపాడింది. ఈ పాటల్లన్నీ యూట్యూబ్ లో సూపర్ హిట్ అయ్యాయి.

## ఆ పాత్ర పైనే ఆశలు పెట్టుకున్న రుక్మిణి..

సాధారణంగా హీరో కైనా.. హీరోయిన్ కైనా ఒక్క పాత్ర చాలు వారి కెరియర్ ను అమాంతం మార్చేయడానికి.. అది నెగిటివ్ గా అయినా సరే.. పాజిటివ్ గా అయినా సరే.. అందుకే సెలబ్రిటీలు తమ పాత్రల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తూ ఉంటారు. అంతేకాదు ఆ పాత్ర సక్సెస్ అయితే తమకు తదుపరి అవకాశాలు వస్తాయని ఆలోచిస్తూ ఉంటారు.ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ ఒక సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకుని.. ఆ పాత్ర తనకు మరిన్ని ఆఫర్లు తెచ్చి పెడుతుందని భావించింది. కానీ అనూహ్యంగా ఆ సినిమా డిజాస్టర్ అవ్వడంతో అమ్మడి ఆశలన్నీ ఆవిరి అయిపోయాయి. దీంతో చేసేదేమీ లేక తన తదుపరి సినిమాపై అంచనాలు పెట్టుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. మరి ఆమె ఎవరు? ఏ సినిమా ఆమె ఆశలపై నీళ్లు చల్లింది? ప్రస్తుతం ఏ పాత్ర పై ఆమె అంచనాలు పెట్టుకుంది? అనే విషయం ఇప్పుడు చూద్దాం. ఆమె ఎవరో కాదు రుక్మిణి వసంత్.. కన్నడ సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన ఈమె.. తెలుగులో 'సప్త సాగరాలు దాటి' అనే సినిమాతో అడుగుపెట్టింది. ఇటీవల నేరుగా నటించిన తెలుగు చిత్రం 'అప్పుడో



ఇప్పుడో ఎప్పుడో'.. తెలుగు సినిమా ఇదే అయినప్పటికీ ఈ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు.. ఇటీవల ఏ.ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా వచ్చిన 'మదరాసి' సినిమాలో హీరోయిన్ గా నటించిన ఈమె.. ఈ సినిమాపై ఎంతో ఆశలు పెట్టుకుంది. కానీ అనూహ్యంగా ఈ సినిమా డిజాస్టర్ అవడంతో అమ్మడి ఆశలు కాస్త ఆవిరిపోయాయి. ప్రస్తుతం రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వస్తున్న కాంతార చాప్టర్ వన్ సినిమాలో ఈమె నటిస్తోంది. అక్టోబర్ 2వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో తాజాగా ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ముఖ్యంగా విజువల్స్ వేరే లెవెల్ అనే చెప్పాలి. వీఎఫ్ఎక్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, హీరో నటన అన్నీ కూడా సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఇందులో రుక్మిణి వసంత్ యువరాణి పాత్రలో నటిస్తోంది. అయితే ఇప్పుడు ఈ పాత్ర పైనే ఈమె ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ ట్రైలర్ చూస్తుంటే.. యువరాణి - గిరిజన యోధుడి మధ్య ప్రేమ ట్రాక్ తో వీరి మధ్య కథను రూపొందించినట్లు తెలుస్తోంది. పీరియాడికల్ ఫిలిం కాబట్టి ఖచ్చితంగా ఈ సినిమా తనకు మంచి గుర్తింపును అందిస్తుందని రుక్మిణి ప్రయత్నం చేస్తోంది. మరి రుక్మిణికి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి.




హైదరాబాద్, సెప్టెంబర్ 25: దసరా నవరాత్రుల వేళ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఉద్యోగులకు దసరా కానుక ప్రకటించింది. అందులో భాగంగా రాష్ట్రంలో భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో 708 మంది ఎఫ్‌టీఎస్‌లను టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ యా ఉద్యోగుల జీతాలు పెంచుతూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొనగాల మహేష్ స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.




## నితిన్ గడ్కరీతో కిషన్ రెడ్డి భేటీ.. ఆ అంశంపై కీలక చర్చలు..

ఢిల్లీ: కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఆయనతో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రహదారుల నిర్మాణంపై చర్చించినట్లు చెప్పారు. తెలంగాణలో 33 జిల్లాల రహదారులను జాతీయ రహదారులకు అనుసంధానం చేసే విధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రహదారుల నిర్మాణంలో రోడ్డు సేఫ్టీ ప్రధాని భూమిక పోషిస్తుందని స్పష్టం చేశారు.

దేశ అభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకంగా ఉంటుందని వివరించారు. విజయవాడ, బెంగుళూరు, నాగపూర్, బాంబే వంటి అన్ని రాష్ట్రాలకు అద్భుతంగా జాతీయ రహదారులు ఏర్పాటు చేశారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల ఏర్పాటు ద్వారా వెనుకబడిన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఆధ్వర్యంలో 34 ప్రాజెక్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 422 కిలోమీటర్ల రోడ్లను రూ. 868 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. సిరోంచ టు మహదేవ్ పూర్ సెక్షన్ నేషనల్ హైవేను 17 కిలోమీటర్లలో రూ. 163 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. గౌరెల్లి టు వలిగొండ హైవేను 42 కిలోమీటర్లుకు రూ. 690.33 కోట్లతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 4 లైన్ల హైవే నిర్మాణం నల్గొండ టౌన్ నుంచి నకిరేకల్ టు నాగార్జున సాగర్ వరకు 14 కిలోమీటర్ల మేర రూ. 516.17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఐకానిక్ బ్రిడ్జి (కృష్ణానది సోమశిల)13.4 కిలోమీటర్లను రూ. 436 కోట్ల వ్యయంతో చేపడుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.




హైదరాబాద్: కాళేశ్వరం అంశంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కాళేశ్వరం అంశంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను స్మితా సభర్వాల్ హైకోర్టులో సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి: కేటీఆర్

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదని, తెలంగాణ సంస్కృతి



పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేసేలా చూడాలని సూచించారు.




## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో కీలక మలుపు.. ఈడీ విచారణకు జగపతిబాబు

హైదరాబాద్: నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. జగపతి బాబుని నాలుగు గంటలపాటు ఈడీ అధికారులు విచారించినట్లు సమాచారం. సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఆయన్ను ఈడీ విచారణకు పిలిచింది. సాహితీ తరఫున పలు ప్రకటనలో నటించిన జగపతిబాబుకు, సాహితీ కంపెనీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల మధ్య ఈడీ విచారించింది. సాహితీ లక్ష్మీనారాయణ కంపెనీ అకౌంట్‌లో నుంచి జగపతిబాబుకు నగదు బదిలీ అయినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.
పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ అయినందున ఆయన్ని పిలిచి విచారించినట్లు వెల్లడించారు. జగపతిబాబుకు సాహితి నుంచి వచ్చిన డబ్బులకు సంబంధించి సమాచారం తెలుసుకున్నామని అధికారులు స్పష్టం చేశారు. సాహితీ ఇన్ఫ్రా, ప్రీ లాంచింగ్ పేరుతో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణం పేరిట కొనుగోలుదారుల నుంచి రూ.248.27కోట్ల మేర వసూలు చేసి, నిర్మాణాలు చేపట్టకుండా మోసానికి పాల్పడిందని ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు సాహితీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఈడీ దర్యాప్తు చేసింది. సాహితీ నిర్వాహకులు రూ.126కోట్లు కొనుగోలు దారుల నుంచి వసూలు చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులతో పలు ఆస్తులను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు అధికారులు ఆస్తులను గుర్తించి జప్తు చేశారు. సాహితీ కేసులో మరింత లోతైన విచారణలో భారీఎత్తున స్కామ్ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిలో భాగంగానే సాహితీ ఇన్ఫ్రాకు ప్రకటనలు చేసిన నటినటులను ఈడీ విచారిస్తోంది.




నిర్మల్ జిల్లా బాసరలో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోకి వరద ప్రవాహం పెరుగుతోంది. బాసర జ్ఞానసరస్వతీ ఆలయం నుంచి గోదావరి పుష్కర ఘాట్‌కు వెళ్లే రహదారి పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో భక్తులు అటువైపు వెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మొదటి పుష్కర ఘాట్ వద్ద మెట్లపైకి వరద నీరు చేరింది. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారు గురువారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే వేదపండితులు అమ్మవారికి కుంకుమాభిషేకాలు, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.




హైదరాబాద్: నేడు, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. నేడు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## సృష్టి ఫెర్టిలిటీ సరోగసీ కేసులో ఈడీ సోదాలు




హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సరోగసీ కేసులో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో సోదాలు నిర్వహిస్తున్నారు. సరోగసీ చట్టాల ఉల్లంఘన, భారీ ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది.

సృష్టి ఫెర్టిలిటీపై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసిన పోలీసులు.. డాక్టర్ నమ్రతతో పాటు పలువురిని అరెస్టు చేశారు. ప్రత్యేక బృందం (సిట్) ఈ కేసులను దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఈడీ అధికారులు కూడా రంగంలోకి దిగారు.

## స్థానిక ఎన్నిక.. కాంగ్రెస్ కన్ఫ్యూజన్‌లో ఉంది.. రఘునందన్ రావు సెటైర్లు



సిద్దిపేట, సెప్టెంబరు 25 : స్థానిక సంస్థల ఎన్నికపై కాంగ్రెస్ ప్రభుత్వం దోబూచులాడుతోందని బీజేపీ మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు విమర్శించారు. 20నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏం చేయాలో అర్థం కానీ కన్ఫ్యూజన్‌లో ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసమర్థతను, అవినీతిని, కుటుంబ పాలనను ఎండగడుతామని కాంగ్రెస్ చెప్పి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏం చేస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. లక్ష కోట్లు కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించి పేద ప్రజలకు అందిస్తామని కాంగ్రెస్ చెప్పలేదా అని ప్రశ్నించారు. నేడు డబ్బులు లేవని సంక్షేమ పథకాలు ఇవ్వలేని దుస్థితికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేరిందని ఆరోపించారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో దోసుకున్న సొమ్ముతో కొందరు ఆగడం లేదని మండిపడ్డారు ఎంపీ రఘునందన్ రావు. బీఆర్ఎస్ నేతలు మీడియాను మేనేజ్ చేసి నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(గురువారం) సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు. వర్షాలు బాగా కురిశాయని.. ఒక దశలో వానలు ఆగాలని అన్నదాతలు కోరుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి, పర్యావరణం ప్రకోపిస్తోందని తెలిపారు. మనుషుల ప్రవర్తన మారి మంచి బుద్ధి ప్రసాదించాలని నవరాత్రుల సందర్భంగా కనక దుర్గమ్మను కోరుకున్నానని పేర్కొన్నారు. దేశంలో జాతీయ రహదారులు తప్పా మిగతా రహదారులపై కనీసం కారు వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు ఎంపీ రఘునందన్ రావు. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్లు గుంతల మయంగా మారాయని వెల్లడించారు.

దసరా సెలవులను ఉపాధ్యాయులు రద్దు చేసుకొని ఉద్యోగం చేయాలనే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి చేస్తోందని ప్రశ్నించారు. దసరా సెలవుల కోసం ఊరు వెళ్లిన ఉపాధ్యాయులను ఉద్యోగం చేయాలని ఎందుకు అధికారులు కోరుతున్నారని నిలదీశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని.. ఇప్పటికీ కూడా అందుకు సంబంధించిన జీవో ఎందుకు పాస్ చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ జీవోపై ఎవరూ కోర్టుకి వెళ్తారో తెల్వని పరిస్థితిలో ఉద్యోగులను దసరా సెలవుల్లో కూడా పని చేయించడం సరికాదని చెప్పుకొచ్చారు. దసరా సెలవుల్లో కూడా ఉద్యోగులతో ప్రభుత్వం పని చేయిస్తోందని.. ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com